PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 42 సంచిక : 332 | విజయవాడ, సోమవారం 3 జులై 2023 | 6 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Monday 3 July 2023 | Rs

శాస్త్రీయతను దెబ్బతీసేందుకు

సైన్స్ అవార్డుల రద్దు

- కేంద్రం వైఖరికి నిరసనగా జెవివి ఆధ్వర్యంలో సైన్స్ వాక్

లోపలి పేజీలో..



పోలవరం నిర్వాసితుల మహా ధర్నా పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వి శ్రీనివాసరావు, సిహెచ్ బాబూరావు తదితరులు



బహిరంగ సభలో మాట్లాడుతున్న రాహుల్ గాంధీ

తెలంగాణలో

కాంగ్రెస్‌దే అధికారం

- పోడు భూములు పంపిణీ చేస్తాం
- ఖమ్మం సభలో రాహుల్

ప్రజాశక్తి- హైదరాబాద్ బ్యూరో

కర్ణాటకలో మాదిరిగానే తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ అన్నారు. తెలంగాణలో బిజెపి పని అయిపోయిందని తెలిపారు. బిఆర్ఎస్ పార్టీ బిజెపికి బి టీంగా మారిందని విమర్శించారు. మాజీ ఎంపి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరిక, భట్టి పాదయాత్ర ముగింపు సందర్భంగా ఆదివారం ఖమ్మంలో నిర్వహించిన తెలంగాణ జనగర్జన సభలో రాహుల్‌గాంధీ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. భారత్ జోడోయాత్ర తర్వాత తెలంగాణకు రావడం సంతోషంగా ఉందన్నారు. ప్రజల్లో విద్వేషం తొలగించి దేశాన్ని ఏకం చేసేందుకు జోడో యాత్ర చేశానని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే చేయూత పేరుతో వృద్ధులు, వితంతులకు రూ.4 వేలు చొప్పున పింఛను ఇస్తామని ప్రకటించారు. పోడు భూములన్నీ గిరిజనులకు పంపిణీ చేస్తామని హామీ ఇచ్చారు. బిఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరిన పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి పులిలా పోరాడుతున్నార న్నారు. పీపుల్స్ మార్చ్ పాదయాత్ర చేసి ప్రజల కష్టాలు తెలుసుకున్న సిఎల్‌పి నేత భట్టి విక్రమార్కకు అభినందనలు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ప్రజల స్వప్నాన్ని కావాలని బిఆర్ఎస్ ధ్వంసం చేసిందని, బిఆర్ఎస్ అంటే బిజెపి రిష్తేదార్ పార్టీ (బిజెపి బంధువుల పార్టీ) అని విమర్శించారు. సిఎం కెసిఆర్ తెలంగాణకు రాజుగా భావిస్తున్నారని, ఈ రాష్ట్రం ఆయన జాగీరు అనుకుంటున్నారని దుయ్యబట్టారు. ధరణితో భూములు దోచుకుంటున్నారని, మిషన్ భగీరథలో రూ.వేల కోట్లు, కాళేశ్వరంలో రూ.లక్షల కోట్లు దోచుకున్నారని ఆరోపించారు. రైతులకు వ్యతిరేకంగా నరేంద్ర మోడీ ప్రభుత్వం తెచ్చిన వ్యవసాయ నల్ల చట్టాలను కాంగ్రెస్ పార్టీ వ్యతిరేకిస్తే, బిఆర్ఎస్ మద్దతు పలికిందని గుర్తు చేశారు. కెసిఆర్ రిమోట్ ప్రధాని మోడీ చేతిలో ఉందని విమర్శించారు. కర్ణాటకలో రైతులు, ఆదివాసీలు, పేదలు అందరూ కాంగ్రెస్ పక్షాన నిలిచారని, తెలంగాణలో కూడా ఇదే జరగబోతోందని పేర్కొన్నారు. తెలంగాణలో బిజెపి పని అయిపోయిందని, కాంగ్రెస్ బిఆర్ఎస్ మధ్యే పోటీ ఉంటుందని అన్నారు. ఇటీవల ఢిల్లీలో విపక్షాల సమావేశం జరిగిందని, ఆ భేటీకి బిఆర్ఎస్ వస్తే తాము హాజరుకాబోమని స్పష్టం చేశామని రాహుల్ ఈ సందర్భంగా గుర్తు చేశారు.బహిరంగ సభకు టిపిసిసి అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, ప్రజా గాయకుడు గద్దర్, కాంగ్రెస్ పార్టీ ఎంపిలు, ఎమ్మెల్యేలు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

జనగణన మళ్లీ వాయిదా

- పాలనా సరిహద్దులు మూసివేత గడుపు 2024 జనవరి1వరకు పొడిగింపు
- బడ్జెట్ కేటాయింపుల కుదింపు

న్యూఢిల్లీ : ఎప్పుడో పూర్తి కావాల్సిన జాతీయ జనాభా లెక్కల సేకరణ-2021ను మోడీ ప్రభుత్వం మళ్లీ వాయిదా వేసింది. జనాభా వివరాలు సేకరించేటప్పుడు పాలనా పరమైన సరిహద్దుల మూసివేత గడువును వచ్చే ఏడాది జనవరి 1 వరకు పొడిగించింది. 2021 జనాభా లెక్కల సేకరణ కార్యక్రమానికి గత బడ్జెట్‌లో రూ. 3,675 కోట్లు కేటాయించిన ప్రభుత్వం, 2023-24 బడ్జెట్‌లో రూ.1564 కోట్లకు కుదించేసింది. చావు కబురు చల్లగా చెప్పినట్టు జనాభా లెక్కల నమోదు వచ్చే ఏడాది చేపట్టవచ్చని చెప్పింది ఈ విషయంలో తదుపరి ఉత్తర్వులు ఇచ్చేవరకు జనగణనను చేపట్టవద్దని అన్ని రాష్ట్ర, కేంద్ర పాలిత ప్రభుత్వాలకు రిజిస్ట్రార్ జనరల్ ఆఫ్ ఇండియా (ఆర్‌జిఐ) ద్వారా లేఖలు పంపింది. జనగణన కోసం తాలుకాలు, జిల్లాల పరిపాలన సరిహద్దులను స్థంభింపజేయడా నికి గడువును జనవరి 1, 2024 వరకూ ఆర్‌జిఐ పొడిగించింది. సాధారణంగా ఈ సరిహద్దులను స్థంభింపచేసిన తరువాత కొన్ని నెలలు తరువాత జనగణన ప్రారంభమవుతుంది. జనగణనలో పాల్గొనే ఎమ్యూనేటర్ల శిక్షణకే కనీసం మూడు నెలలు కేటాయిస్తారు. వచ్చే ఏడాది ఏప్రిల్, మేలో సాధారణ ఎన్నికలు జరుగుతాయి. ఈ ప్రకారం చూస్తే పరిపాలన సరిహద్దులు నిర్ణయించిన తరువాత ఈ ఎన్నికల నిర్వహణకే సిబ్బందిని కేటాయించాల్సి వస్తుంది. కాబట్టి కేంద్రంలో కొత్త ప్రభుత్వం కొలువుతీరిన తరువాతే జనగణన 2021 ప్రారంభమవుతుంది. మనదేశంలో ప్రతీ పదేళ్లకొకసారి జనగణనను నిర్వహిస్తుంటారు. 2021లో జరగాల్సిన జనగణనను కరోనా వైరస్ విజృంభణను చూపుతూ మోడీ ప్రభుత్వం వాయిదా వేసింది. తాజా వాయిదాకు ఎలాంటి కారణాన్ని మోడీ ప్రభుత్వం వెల్లడించలేదు.

ఆ 9.28 లక్షల

జెవికె కిట్లు ఏవీ?

రూ. 175 కోట్లను పట్టించుకోని సర్వశిక్షా అభియాన్ • మిగిలిన వాటిని వదిలేసి కొత్త టెండర్లు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రభుత్వం పాఠశాల విద్యార్థులకు అందిస్తున్న జగనన్న విద్యాకానుక కిట్లు(జెవికె)ల్లో అవినీతి చోటు చేసుకుందని సందేహాలు వ్యక్తమవుతున్నాయి. గత రెండేళ్లుగా పాఠశాలల్లో ఉన్న విద్యార్థుల సంఖ్య కంటే ఎక్కువ కిట్లను ప్రభుత్వం కొనుగోలు చేసింది. విద్యార్థులకు అందించిన తరువాత మిగిలిన కిట్లను పట్టించుకోకుండా సమగ్రశిక్షా అభియాన్ మరలా కొత్త విద్యాసంవత్సరానికి టెండర్లను పిలిచింది. 2021-22, 2022-23 విద్యాసంవత్సరాల్లో రూ.175కోట్ల విలువైన 9,28,824 కిట్లు ఏమయ్యాయో తెలియడం లేదు.

వైసిపి ప్రభుత్వం విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్, బూట్లు, రెండు జతల సాక్సులు, ఒకటి, ఆరో తరగతి విద్యార్థులకు డిక్షనరీలు, బ్యాగ్, బెల్ట్, యునిఫారం, వర్క్‌బుక్స్‌ను జెవికె కిట్ల రూపంలో అందిస్తున్న విషయం తెలిసిందే. 2020-21 విద్యాసంవత్సరం నుంచి ప్రభుత్వం అందిస్తోంది. 2020-21లో 39,70901 కిట్లను రూ.655.60కోట్లతో విద్యార్థులకు అందించింది. 2021-22 విద్యాసంవత్సరానికి 47,32,061 జెవికె కిట్లకు టెండర్లను పిలిచింది. దీనికోసం రూ.789.21కోట్లను ఖర్చు చేసింది. ఒక్కొ కిట్ సరాసరి రూ.1667.79లు చొప్పున కొనుగోలు చేసింది. అయితే 2021-22 విద్యాసంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలల్లో చేరిన విద్యార్థుల సంఖ్య 45,60,041 మాత్రమే. ఈ విద్యాసంవత్సరం 1,72,020 కిట్లు మిగిలి వున్నాయి. వాటి విలువ రూ.28.67కోట్లు. వీటిని ఏం చేశారో అధికారులు చెప్పడం లేదు. మిగిలిన కిట్లను కొత్త విద్యా సంవత్సరం 2022-23లో సర్దుబాటు చేయలేదు. 2021-22లో చేరిన విద్యార్థులతో పాటు అదనంగా 5శాతం అంటే 2,28,002 కలుపుకుని 47,88,043 కిట్లను 2022-23 విద్యాసంవత్సరానికి కొనుగోలు చేసింది. ఈ ఏడాది సరాసరి ఒక్కొ కిట్టును రూ.2006ల చొప్పున రూ.960,48,89,384 కోట్లతో కొనుగోలు చేసింది. అయితే 2022-23లో ప్రభుత్వ పాఠశాలల్లో చేరిన విద్యార్థులు 40,31,239 మాత్రమే. ఈ ఏడాది కూడా కొనుగోలు చేసిన కిట్లలో 7,56,804 మిగిలాయి. వీటి విలువ సుమారు రూ.151,81,48,824 కోట్లు.ప్రస్తుత విద్యాసంవత్సరం గతేడాది చేరిన విద్యార్థుల సంఖ్యకు అదనంగా 5శాతం కలుపుకుని 4,23,7487 కిట్లను కొనుగోలు చేయాల్సిన విద్యాశాఖ 43,101,65 కిట్లను కొనుగోలు చేసింది. వీటికోసం రూ.1042.53కోట్లను ఖర్చు చేసింది. ఒక్కొ దానికి సరాసరి రూ.2418లు ఖర్చు అయింది. గత విద్యాసంవత్సరంలో ఇచ్చిన కిట్లు నాణ్యత లేవు. బూట్లు, బ్యాగులు విద్యార్థులకు ఇచ్చిన రెండు నెలల్లోనే పాడయ్యాయి. దీంతో పెద్ద ఎత్తున విమర్శలు రావడంతో టెండర్‌దారుల నుంచి 6,13,003 బ్యాగులను సమగ్రశిక్షా రీప్లేస్ చేయించింది. కాంట్రాక్టర్లపై ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ఈ ఏడాది కిట్ల నాణ్యత కోసమని కేంద్ర సంస్థ అయిన క్వాలిటీ కౌన్సిల్ ఆఫ్ ఇండియాకు మొత్తం ప్రాజెక్టు ధరలో 0.5శాతం అంటే రూ.5.59కోట్లను అప్పగించింది. మిగులుతేలిన 9.28 లక్షల కిట్ల లెక్క అధికారులు ఇప్పటికైనా తేల్చుతారో లేదో!



విద్యాసంవత్సరం	విద్యార్థుల సంఖ్య	కొనుగోలు చేసిన కిట్లు	మిగిలిన కిట్లు
2021-22	45,60,041	47,32,064	1,72,020
2022-23	40,31,239	47,88,043	7,56,804
2023-24		43,101,65	

పోలవరం నిర్వాసితుల సమస్యలపై

5 తర్వాత ఉద్యమ కార్యాచరణ

- మీడియాతో వి శ్రీనివాసరావు

ప్రజాశక్తి- కృష్ణా ప్రతినిధి, గన్నవరం

'పోలవరం నిర్వాసితుల సమస్యల పరిష్కారానికి ఈ నెల నాలుగో తేదీన విజయవాడలో జరిగే మహా ధర్నా పట్ల ప్రభుత్వ స్పందన చూస్తామని, ఐదో తేదీన ప్రభుత్వంతో జరిగే చర్చల తర్వాత అంగీకరించిన అంశాల ఆధారంగా పూర్తి స్థాయి ఉద్యమ కార్యాచరణ ప్రకటిస్తామని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు తెలిపారు.

పోలవరం పోరుకేక మహాపాదయాత్ర 13వ రోజు ఆదివారం కృష్ణా జిల్లా బాపులపాడు మండలం హనుమాన్ జంక్షన్ నుంచి గన్నవరం వరకూ కొనసాగింది. ఉంగుటూరు మండలం తేలప్రోలు వద్ద మీడియాతో శ్రీనివాసరావు మాట్లాడారు. నాలుగో తేదీన విజయవాడలో మహాధర్నా చేపట్టామని, ఈ నేపథ్యంలో ఐదో తేదీన చర్చలకు రావాలని మంత్రి అంబటి రాంబాబు పిలిచారని తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఈ నెల ఐదో తేదీన ఢిల్లీ పర్యటనకు వెళ్తున్నారని, అక్కడ సిఎం ఏమి మాట్లాడతారు? ఏమి చర్యలు ప్రకటిస్తారనేది చూస్తామని తెలిపారు. ఆ తర్వాత తమ కార్యాచరణ ప్రకటిస్తామని చెప్పారు. పోలవరం అంటే కేవలం డ్యాం కాదని, కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించడమూ కాదని తెలిపారు. నిర్వాసితులకు పరిహారం, పునరావాసం కల్పించడమే ప్రథమ ప్రాధాన్యతగా ఉండాలని స్పష్టం చేశారు. పోలవరం జాతీయ ప్రాజెక్టు అయినందున పునరావాసం బాధ్యత కేంద్రానిదేన్నారు.

రూ.33 వేల కోట్లు ఇవ్వాల్సిన ప్రధాని మోడీ రూ.7500 కోట్లు మాత్రమే ఇస్తామని ప్రకటించడం దారుణమన్నారు. కేంద్రంపై ఒత్తిడి తెచ్చి పూర్తి స్థాయిలో నిధులు రాబట్టాలని, ప్రతి పైసా ముందుగా నిర్వాసితుల పునరావాసానికే ఖర్చు చేయాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్టర్లకు ఇచ్చి కమీషన్లు తీసుకుంటామంటే రాష్ట్ర ప్రజలు ఊరుకోబోరని హెచ్చరించారు. వైసిపి అనుయాయులు సైతం ఈ యాత్రకు మద్దతు తెలుపుతున్నారన్నారు. పోలవరం నిర్వాసితుల సమస్యలపై వైసిపి నాయకులు, గన్నవరం ఎమ్మెల్యే డాక్టర్ వల్లభనేని వంశీ ముఖ్యమంత్రిపై ఒత్తిడి తీసుకురావాలని ఆయన కోరారు. రాష్ట్రానికి వర ప్రసాదినిగా ఉన్న పోలవరం ప్రాజెక్టు కోసం అక్కడి ప్రజలంతా త్యాగం చేశారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరుతో పోలవరం పునరావాస బాధితుల బతుకులు త్రిశంకు స్వర్గంలో పడ్డాయని తెలిపారు. గత వరదల్లో 193 గ్రామాలు మునిగితే 56 గ్రామాలనే ప్రభుత్వం గుర్తించిందన్నారు. 2013 భూ సేకరణ చట్టం ప్రకారం 18 ఏళ్లు నిండిన యువతకు ప్యాకేజీ ఇవ్వాలని, గ్రామాలను ఖాళీ చేసే తేదీని దీనికి ప్రాతిపదికగా తీసుకోవాలని డిమాండ్ చేశారు.

కాఫర్ డ్యాం వల్ల గతేడాది ఎన్నడూ లేనంతగా వరద వచ్చిందని, వరద బాధితులను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలమైందని తెలిపారు. నిర్వాసితులను మళ్లీ ఇప్పుడు వరద భయం వెంటాడుతోందన్నారు. విలేకర్ల సమావేశంలో సిపిఎం నాయకులు వై.నరసింహారావు, ఆర్.రఘు తదితరులు పాల్గొన్నారు.



హౌస్ సర్జన్ ఆత్మహత్య

- 'నారాయణ' మెడికల్ కళాశాలలో ఘటన

ప్రజాశక్తి- నెల్లూరు

నారాయణ మెడికల్ కళాశాలలో హౌస్ సర్జన్ ఆత్మహత్య చేసుకుంది. ఆదివారం తెల్లవారు జామున ఈ ఘటన చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. శ్రీకాకుళం జిల్లా పలాసకు చెందిన చైతన్య (24) నెల్లూరులోని నారాయణ మెడికల్ కళాశాలలో హౌస్ సర్జన్ చేస్తోంది. మూడు నెలల కిందటే ఆమెకు వివాహమైంది. కళాశాలలో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. భర్త వేధింపులే ఆత్మహత్యకు కారణమని చైతన్య కుటుంబ సభ్యులు ఆరోపించారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ చేపట్టాలని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాలు కళాశాల ఎదుట ఆందోళన చేపట్టాయి. నెల్లూరు రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఎన్‌సిపిలో చీలిక

- షిండే కేబినెట్‌లో డిప్యూటీ సిఎంగా అజిత్ పవార్ ప్రమాణం
- దోపిడీగా పేర్కొన్న శరద్ పవార్

ముంబయి : మహారాష్ట్రలో బిజెపి భ్రష్టాచార రాజకీయాలకు మళ్లీ తెర తీసింది. ఎన్‌సిపిని నిలువునా చీల్చి అజిత్ పవార్ నేతృత్వంలోని ముక్కను ఎన్‌డిఏలో కలుపుకుంది. 2019లో సృష్టించిన సీన్‌నే అజిత్ పవార్ ఇప్పుడు పునరావృతం చేశారు. ప్రతిపక్ష పార్టీ నేతగా ఉన్న ఆయన ఒక్కసారిగా ప్లేటు ఫిరాయించి షిండే మంత్రివర్గంలో రెండో ఉప ముఖ్యమంత్రిగా ఆదివారం పదవీ స్వీకార ప్రమాణం చేశారు. ఆయనతోబాటు ఓ అర డజను మందికిపైగా ఆయన అనుచరులను మంత్రివర్గంలోకి తీసుకున్నారు. వీరిలో చాలా మంది అవినీతి కేసులను ఎదుర్కొంటున్నవారే. ఎన్‌సిపి ఫినిష్ అయిపోతుందని కొద్ది రోజుల కిందట ప్రధానమంత్రి నరేంద్ర మోడీ వ్యాఖ్యానించిన నేపథ్యంలో ఈ పరిణామాలను చూడాలి. ఇడి దాడులు, అవినీతి కేసులతో బిజెపి ఆడుతున్న బ్లాక్ మెయిల్ రాజకీయాలకు తలొగ్గిన అజిత్ పవార్ నేషనలిస్టు కాంగ్రెస్ పార్టీ (ఎన్‌సిపి)లో ఇదివరకు ఒక సారి తిరుగుబాటు బావుటా ఎగరేసి బిజెపి పంచన చేరి, మళ్లీ వెనక్కి వచ్చారు. వచ్చే ఏడాది అక్టోబరులో అసెంబ్లీ ఎన్నికలు జరగనుండగా సంవత్సర కాలం కోసం డిప్యూటీ సిఎం పదవి ఆశించి అందులో చేరారు. ఇప్పటికే ఉపముఖ్యమంత్రిగా దేవేంద్ర ఫడ్నవీస్ ఉన్నారు. రాజ్‌భవన్‌లో ఆదివారం జరిగిన కార్యక్రమంలో అజిత్ పవార్‌తో రాష్ట్ర గవర్నరు రమేశ్ బయాజ్ ప్రమాణం స్వీకారం చేయించారు. ఎన్‌సిపికి చెందిన మరో 8 మంది నేతలు ఛగన్ భుజ్బల్, దిలీప్ వాల్సే పాటిల్, హసన్ ముషరీఫ్, ధనాంజయ్ ముండే, అదితి తత్కారే, ధర్మరావ్ అత్రమ్, అనిల్ పాటిల్, సంజయ్ బంసోడే రాష్ట్ర మంత్రులుగా ప్రమాణం చేశారు. కాగా రాజ్‌భవన్‌లో జరిగిన కార్యక్రమానికి హాజరైన శాసనసభ స్పీకర్ మాట్లాడుతూ 'ప్రతిపక్ష

మిగతా 5లో



డిప్యూటీ సిఎంగా ప్రమాణ స్వీకారం చేస్తున్న అజిత్ పవార్

బాల్టిమోర్‌లో కాల్పులు

- ఇద్దరు మృతి, మరో 28 మందికి గాయాలు
- అమెరికాలో పెచ్చరిల్లుతున్న తుపాకీ సంస్కృతి

బాల్టిమోర్‌సిటీ: అమెరికాలో తుపాకీ సంబంధిత మరణాలు ఏయేటి కాయేడు పెరుగుతూనే ఉన్నాయి. తాజాగా బాల్టిమోర్ సిటీలో శనివారం అర్ధరాత్రి దాటాక బ్రూక్లిన్ హోమ్ ఏరియాలోని బ్లాక్ పార్టీపై సాయుధ దుండగులు కొందరు దాడి చేసి విచక్షణారహితంగా కాల్పులు జరిపారు. ఈ కాల్పుల్లో ఇద్దరు చనిపోయారు. మరో 28 మంది గాయపడ్డారు. వీరిలో ముగ్గురి పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. బాల్టిమోర్ సిటీ యాక్టింగ్ పోలీస్ కమిషనర్ రిచర్డ్ వర్లీ ఆదివారం నాడిక్కడ విలేకరులతో మాట్లాడుతూ, మూకుమ్మడి కాల్పుల్లో బాధితులు 30 మంది దాకా ఉన్నారని చెప్పారు. చనిపోయినవారిలో 18 ఏళ్ల యువతి కూడా ఉన్నట్టు తెలిపారు. కాల్పుల తరువాత హంతకులను ఎవరినీ పోలీసులు ఇంతవరకు పట్టుకోలేకపోయారు. ఆ ప్రాంతమంతా బీభత్సకర దృశ్యాలతో భయానకంగా ఉంది. ఇది పిరికిపందల చర్య అని మేయర్ బ్రాండ్ స్కాట్ పేర్కొన్నారు. నిందితులకు సంబంధించి ఎటువంటి సమాచారం తమ వద్ద ఉన్నా వెంటనే పోలీసులకు తెలియజేయాలని స్కాట్ స్థానికులకు సూచించారు. హింసాత్మక నేరాలు ఇంతగా పెరిగిపోతుండడానికి తుపాకుల అమ్మకాలపై ఎలాంటి అడ్డు అదుపు లేకపోవడమే కారణమని సామాజికవేత్తలు అభిప్రాయపడ్డారు. ఇటీవల నిర్వహించిన ఓ సర్వేలో ఈ తుపాకీ సంస్కృతికి చెక్ పెట్టాలని 60 శాతం మంది అమెరికన్లు గట్టిగా అభిప్రాయపడ్డారు. తుపాకీ హింస అతి పెద్ద జాతీయ సమస్యగా ఉందని వారు పేర్కొన్నారు. 9 శాతం మంది మాత్రం గన్స్ ఉంటేనే తుపాకీ యజమాన్యాలకు భద్రత అని పేర్కొన్నారు. తుపాకీ నియంత్రణ బిల్లు ఎప్పుడు అమెరికన్ కాంగ్రెస్ ముందుకు వచ్చినా రిపబ్లికన్లు, డెమొక్రాట్లలో ఒక సెక్షన్ గట్టిగా వ్యతిరేకిస్తున్నది.ఈ ఏడాది ఇంతవరకు 337 మాస్ షూటింగ్స్ (సామూహిక కాల్పులు) ఘటనలు చోటు చేసుకున్నాయి.



కాల్పులు జరిగిన ప్రాంతం నుంచి ఆధారాలు సేకరిస్తున్న ఫోరెన్సిక్ సిబ్బంది

ఎపి ఇసెట్ ఫలితాలు విడుదల

ప్రజాశక్తి- కాకినాడ ప్రతినిధి

కాకినాడ జెఎన్‌టియుకె ఆధ్వర్యంలో గత నెల 20న నిర్వహించిన ఎపి ఇంజనీరింగ్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ (ఎపి ఇసెట్) 2023 ప్రవేశ పరీక్షా ఫలితాలను విసి కాన్ఫరెన్స్ హాల్లో రాష్ట్ర ఉన్నత విద్యా మండలి (ఎపిఎస్‌సిహెచ్‌ఇ) ఛైర్మన్ ప్రొఫెసర్ కె.హేమచంద్రారెడ్డి ఆదివారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 38,181 మంది దరఖాస్తు చేసుకోగా 34,503 మంది పరీక్షకు హాజరయ్యారని, వీరిలో 31,933 (92.55 శాతం) మంది అర్హత సాధించారని తెలిపారు. ర్యాంకు కార్డులను వెబ్ సైట్‌లో పొందుపరుస్తామన్నారు. యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ జివిఆర్ ప్రసాదరాజు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం, రాష్ట్ర ఉన్నత విద్యామండలి సహకారంతో ఎపి ఈసెట్ ప్రవేశ పరీక్షను విజయవంతంగా నిర్వహించామన్నారు. రాష్ట్ర ఉన్నత విద్యామండలి సెక్రటరీ ప్రొఫెసర్ వై.నజీర్ అహ్మద్, ఎపి ఈసెట్ కన్వీనర్ ప్రొఫెసర్ ఎ.కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.

మణిపూర్‌లో ఆగని హింసాకాండ

• మరో నలుగురి మృతి • హింసాకాండ వెనుక విదేశీ హస్తం : బీరెన్ సింగ్ కొత్త ఆరోపణలు

ఇంఫాల్ : మణిపూర్‌లో హింసాకాండ ప్రారంభమై రెండు నెలలు గడుస్తున్నా.. ఇంకా పరిస్థితిలో మార్పు లేదు. బిష్ణుపూర్ జిల్లాలో ఆదివారం జరిగిన దాడిలో నలుగురు మరణించినట్లు పోలీసులు తెలిపారు. ఆదివారం తెల్లవారుజామున సాయుధ దుండగులు జిల్లాలోని ఖుజుమా తాబీ గ్రామంపై కాల్పులతో విరుచుపడ్డారని పోలీసులు చెప్పారు. మే 3 నుంచి మణిపూర్‌లో హింసాకాండ ప్రారంభమయింది. వీటిల్లో ఇప్పటి వరకూ 138 మంది మరణించారు. 60 వేలకు మందికిపైగా ప్రజలు నిరాశ్రయులయారు. రాష్ట్రంలో హింసాకాండ చెలరేగి రెండు నెలలు గడిచినా, ఇప్పటికీ పరిస్థితిని అదుపులోకి తీసుకుని రాలేని ముఖ్యమంత్రి ఎన్. బీరేన్ సింగ్ కొత్త విమర్శలకు దిగారు. హింసాకాండలో విదేశీ హస్తం ఉందంటూ ఆరోపణలు ఎత్తుకున్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతలను పునరుద్ధరించేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని, అయితే ఆ క్రమానికి విఘాతం కలిగించేందుకు అక్రమార్కులు నిరంతరం ప్రయత్నిస్తున్నారన్నారు. ఈ హింస పథకం ప్రకారమే జరుగుతుందని, ఇందులో విదేశీ శక్తుల హస్తం కూడా ఉండే అవకాశం ఉందని ముఖ్యమంత్రి ఎన్.బీరేన్ సింగ్ పేర్కొన్నారు.

మణిపూర్ మయన్మార్‌తో సరిహద్దును పంచుకుంటుందని ముఖ్యమంత్రి ఎన్.బీరేన్ సింగ్ తెలిపారు. 'చైనా కూడా సమీపంలోనే ఉంది. మన సరిహద్దుల్లో దాదాపు 398 కి.మీ.లు సురక్షితంగా లేవు. మన సరిహద్దుల్లో భద్రతా బలగాలు మోహరించబడ్డాయి, అయితే ఈ మోహరింపు అంత పెద్ద ప్రాంతాన్ని కవర్ చేయదు. ఈ మొత్తం విషయం ముందుగానే పరిష్కరించబడినట్లు అనిపిస్తుంది, కానీ దాని వెనుక కారణం ఇంకా స్పష్టంగా లేదు. దీనితో పాటు అతను దానిని పూర్తిగా ధృవీకరించలేను' అని అన్నారు.



ఖుజుమా తాబీ గ్రామంలో తగలబడుతున్న వాహనం

వారం రోజులపాటు 50కిపైగా రైళ్లు రద్దు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలుగు రాష్ట్రాలు సహా ఇతర ప్రాంతాలకు సర్వీసులందించే పలు రైళ్ల సర్వీసులను వారం రోజులపాటు రద్దు చేస్తున్నట్టు దక్షిణ మధ్య రైల్వే ప్రకటించింది. హైదరాబాద్, సికింద్రాబాద్ డివిజన్లు.. విజయవాడ, గుంటూరు డివిజన్ల పరిధిలో మౌలిక వసతుల నిర్వహణ పనుల నేపథ్యంలో భారీ సంఖ్యలో రైళ్లను రద్దు చేస్తూ నిర్ణయం తీసుకుంది. సోమవారం నుంచి ఈ నెల 9వ తేదీ వరకు రద్దు చేస్తున్న రైలు సర్వీసుల జాబితాలను విడుదల చేసింది. దాదాపు 50కి పైగా రైళ్లను.. వారం రోజుల పాటు రద్దు చేయగా.. ఎనిమిది రైళ్లను పాక్షికంగా రద్దు చేసింది. మరో ఐదు రైళ్ల సమయాల్లో తాత్కాలికంగా రీషెడ్యూల్ చేసినట్టు దక్షిణ మధ్య రైల్వే సిపిఆర్ఒ సిహెచ్.రాకేశ్ ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఇవే కాకుండా జంట నగరాల్లో సర్వీసులందించే 22 ఎంఎంటిఎస్ రైళ్ల సర్వీసులనూ రద్దు చేసినట్టు తెలిపారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..

స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ, ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ, అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి, గుంటూరు జిల్లా - 522 501కు కానీ **editorprajasakthi@gmail.com**కు పంపవచ్చు.



సీఎం పర్యటన ఏర్పాట్లు పరిశీలిస్తున్న మంత్రులు

అమూల్‌తో కలిసి విజయ డెయిరీ పునఃప్రారంభం

- చీలపల్లి సిఎంసి ద్వారా అందుబాటులో మెరుగైన వైద్యం
- డిప్యూటీ సిఎం నారాయణస్వామి

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్

ఈ నెల 4న రాష్ట్ర ముఖ్యమంత్రి చిత్తూరు జిల్లా పర్యటన నేపథ్యంలో బహిరంగ సభ వద్ద జరుగుతున్న ఏర్పాట్లను డిప్యూటీ సిఎం కళత్తూరు నారాయణస్వామి, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, జిల్లా పరిషత్ చైర్మన్ శ్రీనివాసులు పరిశీలించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సిఎం మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్మోహన్‌రెడ్డి చిత్తూరు పర్యటన పాడి రైతులకు మేలు జరిగే విధంగా.. మూతపడిన విజయ డెయిరీని అమూల్‌తో కలిసి తిరిగి పున్ణప్రారంభించడం వలన పాల ధరలు పెరుగుతాయని, తద్వారా రైతులకు మేలు జరుగుతుందని తెలిపారు. అలాగే చీలాపల్లి సిఎంసిలో ఆస్పత్రికి భూమిపూజ చేయనున్నట్లు చెప్పారు. చీలాపల్లి సిఎంసిలో 300 పడకల ఆస్పత్రిని ప్రారంభిస్తే ప్రజలకు మెరుగైన వైద్యం అందుబాటులోకి వస్తుందని తెలిపారు. ఏర్పాట్ల పరిశీలనలో కలెక్టర్ సగిలి షన్మోహన్, జిల్లా ఎస్‌పి వై.రిషాంత్ రెడ్డి, చిత్తూరు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, తదితులు ఉన్నారు.

మత మార్పిడులకు జగన్ సర్కారు ప్రోత్సాహం : సోము వీర్రాజు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలో జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం మత మార్పిడులను ప్రోత్సహిస్తోందని బిజెపి రాష్ట్ర అధ్యక్షులు సోము వీర్రాజు పేర్కొన్నారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. దేవాలయాల భూములు, కానుకలు ఇష్టానుసారం ఖర్చు చేస్తూ , మత మార్పిడులకు వీలుగా బాప్టిస్మం ఘాట్ల నిర్మాణం చేపట్టడం దేనికి సంకేతమని సోము వీర్రాజు ప్రశ్నించారు.

ఆర్ అండ్ ఆర్ కాలనీల్లో సౌకర్యాలు కల్పించాలి

- సంక్షేమ కార్యక్రమాలు అమలు చేయాలి
- ముఖ్యమంత్రికి సిపిఎం లేఖ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పోలవరం నిర్వాసితుల కోసం నిర్మించిన పునరావాస కాలనీల్లో సౌకర్యాలు, సంక్షేమ కార్యక్రమాలు అమలుచేయాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు కోరారు. ఈ మేరకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఆదివారం లేఖ రాశారు. పోలవరం ప్రాజెక్టు కోసం సర్వం త్యాగం చేసి వచ్చిన నిర్వాసితులకోసం నిర్మించిన పునరావాస కాలనీలు సమస్యల వలయంగా ఉన్నాయని తెలిపారు. రామయ్యపేట, పైడిపాక వాసులకు నిర్వాసిత కాలనీలను జంగారెడ్డిగూడెం మండలంలో నిర్మించారని పేర్కొన్నారు. వారి సమస్యలు పట్టించుకోవడం లేదని, నిర్వాసిత కాలనీలైన తూటిగుంట, పైడాకులమామిడి, కొరుటూరు, శ్రీరాంపురం, పల్లపూరు, బోరెడ్డిగూడెం కాలనీల్లోని సమస్యలు పరిష్కరించడం లేదని వివరించారు. తమ యాత్ర సందర్శించిన కాలనీల్లోని సమస్యలలో 17 అంశాలను పేర్కొన్నారు. పునరావాస కాలనీలను నిర్మించిన సంస్థ నిర్మాణాల పట్ల నిర్లక్ష్యం చేసిందని, కాసుల కక్కుర్తితో నాణ్యతను పూర్తిగా గాలికి వదిలేసిందని విమర్శించారు. తాము పర్యటించిన దాదాపు అన్ని నిర్వాసిత కాలనీల్లో శ్లాబులు లీకేజీ సమస్య ఉందని, రౌతుగూడెంలో శ్లాబ్ కూలిపోయిందని పేర్కొన్నారు. పూర్తిస్థాయి ప్యాకేజీలు అమలు చేయకుండా అరకొర ప్యాకేజీలు ఇచ్చి ప్రాజెక్టు ప్రదేశం, దాన్ని ఆనుకొని ఉన్న ప్రాంతాలనుండి ప్రజలను బలవంతంగా నిర్వాసిత కాలనీలకు తరలించారని వివరించారు. 18 ఏళ్లు నిండిన యువతీ యువకులందరికీ కటాఫ్ డేట్ మార్చి ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ వర్తింపజేయాలని కోరారు. రోజువారీ పని దొరకడం లేదని, తమ సొంత గ్రామంలో వ్యవసాయం చేసుకుంటూ ఆదాయం పొందిన రైతులు నేడు కూలీలుగా మారిపోయారని వివరించారు. తాడువాయి, శ్రీరాంపురం కాలనీల పరిధిలో వేలాదిమందికి రోజువారీ పని ఉండడం లేదని, రామయ్యపేట వంటి నిర్వాసిత కాలనీలో ఎంబిఎ చదివి కూడా కూలి పనులు వెతుక్కోవలసిన పరిస్థితి ఉందని వివరించారు. నిర్వాసిత కాలనీల్లో జీవిస్తున్నవారికి ఉపాధి అవకాశాలు కల్పించడానికి అనుగుణమైన ప్రణాళికలను ప్రభుత్వం రూపొందించి అమలు చేయాలని కోరారు. ఉపాధిహామీ పథకాన్ని 200 రోజులకు పెంచాలని, చిన్నతరహా పరిశ్రమలు నెలకొల్పాలని, స్థానిక ఆదివాసీలకే అన్నితరహా ఉద్యోగాలు ఇవ్వాలని కోరారు. ఈ ప్రాంతంలోని గుబ్బల మంగమ్మ, మంజులూరు వంటి ప్రాంతాలను పర్యాటక ప్రాంతాలుగా అభివృద్ధి పరచాలని సూచించారు.

18 ఏళ్లు నిండిన వారికి చదువుతో సంబంధం లేకుండా నిరుద్యోగ భృతి కల్పించాలని, చదువుకున్న యువతకు స్కిల్స్ నేర్పించి, ఉద్యోగాలు ఇప్పించాలని కోరారు. రామయ్యపేట, పైడిపాక, తాడువాయి వంటి నాన్-ట్రైబ్స్ కాలనీల్లో బ్యాంక్ రుణాలు ఇప్పించాలని తెలిపారు. పునరావాస కాలనీల్లో మంచినీటి సదుపాయం పూర్తిస్థాయిలో లేదని, సమస్యను వెంటనే పరిష్కరించాలని కోరారు. కొరుటూరు కాలనీలో ఫిల్టర్ చేయకుండానే సరఫరా చేస్తున్నారని, సమస్య పరిష్కారం అయ్యేలోపు వాటర్ ట్యాంక్‌లను ఏర్పాటు చేయాలని తెలిపారు. పునరావాస కాలనీల్లో ఎక్కడా స్మశానవాటికలు లేవని, తూటుగుంట కాలనీలో ఈ మధ్యకాలంలో తొమ్మిది మంది చనిపోయారని వివరించారు. స్మశానవాటిక లేక చుట్టుపక్కల గ్రామాల పెద్దల్ని బ్రతిమిలాడి అంతిమ సంస్కారాలు చేశారని పేర్కొన్నారు. నిరాస్వితులు తమ గ్రామాలను, కట్టుకున్న ఇళ్లను వదిలేసి పునరావాస కాలనీలకు చేరుకుని ఏడాది, రెండేళ్లు అయినా ప్యాకేజీ పూర్తి స్థాయిలో అందలేదని తెలిపారు. పుల్లపూరు కాలనీలోని వేట్ల కన్నమ్మరెడ్డి, సంకురు సోమయ్య, కటుపూరి వీరమణిలకు ప్యాకేజీ అందలేదని పేర్కొన్నారు. నాలవరంలో 350 మందికి, కొరుటూరులో 95 మందికి, బోరెడ్డిగూడెంలో 15 మందికి, పైడాకులమామిడిలో 20 కుటుంబాలకి ప్యాకేజీ రాలేదని వివరించారు. అంగన్‌వాడీ కేంద్రాలను, పాఠశాలలను పూర్తిస్థాయిలో ఏర్పాటు చేయలేదని, నాలవరంలో అంగన్‌వాడీ కేంద్రం లేదని పేర్కొన్నారు. ఎక్కడా అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాలు లేవని, స్కూల్స్ నిర్మాణం జరగలేదని పేర్కొన్నారు. నిర్వాసితులకు పూర్తిస్థాయిలో పునరావాసం, సంక్షేమం కోసం ఐఎఎస్ స్థాయి అధికారిని నియమించాలని కోరారు. ఏలూరు జిల్లా పల్లపూరు, సిరివాక కాలనీల్లో స్మశానాలు లేవని, స్థలాలు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. ఏలూరు జిల్లా కొరుటూరు గ్రామంలో భూమికి భూమి అప్పజెప్పలేదని, భూమి స్వాధీనం చేసేంత వరకు పరిహారం చెల్లించాలని కోరారు. రెండు జిల్లాల్లో నిర్వాసిత కాలనీలలో ఉపాధిహామీ పనులు ఇవ్వడం లేదని తెలిపారు. పునరావాస మండలాలకు జాబ్ కార్డులు బదిలీ చేయాలని, ఉపాధి గ్యారెంటీ ఉండాలని కోరారు. ఎస్‌సి, ఎస్‌టిలకు ఉచిత విద్యుత్ రాయితీలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. పునరావాస కాలనీల్లో కులధ్రువీకరణ పత్రాలు ఇవ్వాలని కోరారు. పునరావాస కాలనీల్లో పూర్తిస్థాయి ప్రాథమిక పాఠశాలలు లేవని, అన్ని కాలనీలలో వెంటనే ప్రాథమిక పాఠశాలలు ప్రారంభించాలని తెలిపారు. కొన్ని ఆదివాసీ నిర్వాసిత గ్రామాలకు లింకు రోడ్డులు లేవని, వెంటనే లింకు రోడ్డులు వేయాలని కోరారు. గతేడాది వరదలకు ముంపుకు గురైన కొన్ని గ్రామాలను మెరక ప్రాంతాలకు తీసుకొచ్చారని, వారికి పరిహారం ఇవ్వలేదని తెలిపారు. మరలా వారి గ్రామాలకు వారిని పంపలేదని, వెంటనే వరద నష్టపరిహారం ఇవ్వాలని కోరారు. చింతూరు, కోట రామచంద్రాపురం ఐటిడిఎలకు ఐఎఎస్ ఆఫీసర్‌లను ప్రాజెక్టు ఆఫీసర్లుగా వెంటనే నియమించాలని కోరారు. ఈ సమస్యలను ప్రత్యేక శ్రద్ధ తీసుకొని తక్షణమే పరిష్కరించాలని ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేశారు.



దీక్షా శిబిరం వద్ద నినాదాలు చేస్తున్న టిఎన్‌టియుసి నాయకులు

ఉక్కు పరిరక్షణకు చొరవ చూపాలి

- రాష్ట్ర ప్రభుత్వానికి టిఎన్‌టియుసి నేతల విజ్ఞప్తి

ప్రజాశక్తి - ఉక్కునగరం (విశాఖపట్నం)

వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను పరిరక్షించడానికి రాష్ట్ర ప్రభుత్వం చొరవ చూపాలని టిఎన్‌టియుసి నేతలు కోరారు. వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు ఆదివారానికి 871వ రోజుకు చేరాయి. దీక్షల్లో టిఎన్‌టియుసి కార్యకర్తలు కూర్చున్నారు. ఈ సందర్భంగా ఆ సంఘం నేతలు మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కదిలి రావాలన్నారు. ప్లాంట్ పరిరక్షణకు టిడిపి కట్టుబడి ఉందని తెలిపారు. గతంలో స్టీల్‌ప్లాంట్ నిర్వహణ ప్రమాదంలో పడినప్పుడు పార్టీ తరుపున నాటి మంత్రి ఎర్రంనాయుడు కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేశారని తెలిపారు. వేలాది మందికి ఉపాధి కల్పిస్తున్న ప్లాంట్‌ను ప్రయివేటుపరం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం పూనుకోవడం దారుణమన్నారు. వెంటనే ప్రయివేటీకరణ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. దీక్షల్లో సంఘం నాయకులు కరణం సత్యారావు, బొడ్డు రమణ, మహాలక్ష్మి నాయుడు, బాలయోగి, ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్ డి.ఆదినారాయణ, జె.రామకృష్ణ, జి.సుబ్బయ్య, ఎస్.అప్పలనాయుడు పాల్గొన్నారు.

సైన్స్‌ను దెబ్బతీసేందుకే అవార్డుల రద్దు

- కేంద్ర ప్రభుత్వ వైఖరికి నిరసనగా జెవివి ఆధ్వర్యంలో సైన్స్ వాక్

ప్రజాశక్తి - విజయనగరం టౌన్/కడప అర్బన్

శాస్త్ర సాంకేతికతను, శాస్త్రీయ దృక్పథాన్ని దెబ్బతీసేందుకే కేంద్ర ప్రభుత్వం సైన్స్ అవార్డులను రద్దు చేసిందని జన విజ్ఞాన వేదిక (జెవివి) నేతలు అన్నారు. సైన్స్ అవార్డుల రద్దు, పాఠ్యాంశాల తొలగింపును నిరసిస్తూ ఆదివారం జెవివి ఆధ్వర్యాన విజయనగరంలో సైన్స్ వాక్, కడపలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. విజయనగరంలో ముందుగా గురజాడ నివాసంలో గురజాడ అప్పారావు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం అక్కడ నుంచి మూడు లాంతర్లు, ఎంజి రోడ్డు, గంట స్తంభం మీదుగా బాలాజీ జంక్షన్ వరకు సైన్స్ వాక్ నిర్వహించారు. అక్కడ అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా జెవివి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎంవిఎన్ వెంకటరావు, రమణ ప్రభాత్, సాహితీ సంస్థ కన్వీనర్ చీకటి దివాకర్ మాట్లాడుతూ.. వైద్య రంగంలోనూ కేంద్ర ప్రభుత్వం అశాస్త్రీయమైన ఆలోచనలు ప్రవేశపెడుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. మానవాళి మనుగడలో విప్లవాత్మకమైన మార్పులను గుర్తించిన డార్విన్ సిద్ధాంతాన్ని రద్దుచేయడం సరికాదన్నారు. దీనివల్ల వల్ల సమాజం మరింత వెనుకబాటుకు గురవుతుందని తెలిపారు. డార్విన్ సిద్ధాంతంతోపాటు భౌతిక, రసాయన శాస్త్రాలు, గణితం, చరిత్రలోని యునైటెడ్ పాఠ్యాంశాలను రద్దు చేయడానికి ప్రభుత్వం వద్ద ఉన్న హేతుబద్ధత ఏమిటో చెప్పాలని డిమాండ్ చేశారు. సైన్స్ అభివృద్ధి చెందితేనే నూతన ఆవిష్కరణలతో దేశాభివృద్ధి సాధ్యమవుతుందని తెలిపారు. అటువంటి సైన్స్ ప్రోత్సాహాన్ని తగ్గించేలా 72 అవార్డులను కేంద్ర ప్రభుత్వం రద్దుచేస్తున్నట్టు ప్రకటించడం దారుణమన్నారు. సైన్స్ అవార్డుల రద్దు నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

కడపలోని ప్రెస్ క్లబ్‌లో 'రాజ్యాంగ పీఠిక ముద్రణలో సెక్యులర్, సోషలిస్ట్ పదాల తొలగింపు, సైన్స్ అవార్డుల రద్దు, పాఠ్యాంశాల తొలగింపు' అనే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జెవివి రాష్ట్ర అధ్యక్షులు రాజశేఖర్ రాహుల్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం సైన్స్ అవార్డులను రద్దు చేయడం, సైన్సు చరిత్ర పాఠ్యాంశాలను తొలగించడం దారుణమని అన్నారు. కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగ విరుద్ధంగా ఏకపక్ష నిర్ణయాలు చేస్తుందని విమర్శించారు. అశాస్త్రీయ అంశాలను జొప్పిస్తూ శాస్త్రీయ అంశాలను తొలగిస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇందులో భాగంగానే 'ఆవర్తన పట్టిక', 'డార్విన్ పరిణామ సిద్ధాంతాం'ను తొలగించిందని తెలిపారు. ఔత్సాహిక యువ శాస్త్రవేత్తలకు, సైన్స్ అధ్యాపక, ఉపాధ్యాయులకు ప్రోత్సాహకంగా అందజేసే సైన్స్ అవార్డులను రద్దు చేయడం సరికాదన్నారు. జెవివి రాష్ట్ర కమిటీ సభ్యులు ఎ.డి. దేవదత్తం అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో రిటైర్డ్ ప్రొఫెసర్ సాంబశివరెడ్డి, ఎల్‌ఐసి యూనియన్ ప్రధాన కార్యదర్శి రఘునాథ్‌రెడ్డి, జెవివి రాష్ట్ర కమిటీ సభ్యులు సరస్వతి, ఎఐటియుసి, డివైఎఫ్‌ఐ, యుటిఎఫ్, ఎస్‌ఎఫ్‌ఐ, ఎఐవైఎఫ్, జెవివి నేతలు పాల్గొన్నారు.



విజయనగరంలో సైన్స్‌వాక్‌లో పాల్గొన్న జెవివి, పలు సంఘాల నాయకులు, మేధావులు, యువత, విద్యార్థులు

రానున్న మూడు రోజుల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు

- విపత్తుల నిర్వహణ సంస్థ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్ర వ్యాప్తంగా రానున్న మూడు రోజుల్లో ఒక మోస్తరు నుంచి భారీ వర్షాలు పడే అవకాశం ఉందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. వర్షాలతోపాటు పిడుగులు పడే అవకాశం ఉన్నట్లు తెలిపారు, ఈనెల 3న పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, కృష్ణా, గుంటూరు, పల్నాడు, బాపట్ల, ప్రకాశం, నెల్లూరు, వైఎస్‌ఆర్, నంద్యాల జిల్లాల్లో అక్కడక్కడ భారీగా వర్షాలు కురిసే అవకాశం ఉందని, మిగిలిన జిల్లాల్లో అక్కడక్కడ తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఈనెల 4న పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, పశ్చిమ గోదావరి, ఏలూరు, కృష్ణా, ఎన్‌టిఆర్, గుంటూరు, పల్నాడు, బాపట్ల, ప్రకాశం, నెల్లూరు, వైఎస్‌ఆర్, నంద్యాల జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపారు. ఈ నెల 5న పార్వతీపురం మన్యం, విజయనగరం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు, కాకినాడ, ఏలూరు, ఎన్‌టిఆర్, పల్నాడు, బాపట్ల, ప్రకాశం, శ్రీసత్యసాయి, అనంతపురం, కర్నూలు, నంద్యాల జిల్లాల్లో అక్కడక్కడ మోస్తరు వర్షాలు పడే అవకాశం ఉందని, మిగిలిన జిల్లాల్లో అక్కడక్కడ తేలికపాటి జల్లులు పడే అవకాశం ఉందని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ పేర్కొన్నారు.

రహదారుల పరిస్థితి అధ్వానం

- జగన్‌కు దోచుకోవడమే తప్ప ప్రజల సమస్యలపై శ్రద్ధలేదు
- యువగళం పాదయాత్రలో లోకేష్

ప్రజాశక్తి -నెల్లూరు ప్రతినిధి

రాష్ట్రంలో రోడ్ల పరిస్థితి అధ్వానంగా ఉన్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ అన్నారు. లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర ఆదివారం నెల్లూరు నగరానికి చేరుకుంది. కాకుపల్లి ప్రారంభమైన పాదయాత్ర ధనలక్ష్మీపురం, నారాయణ మెడికల్ కాలేజీ, అపోలో ఆస్పత్రి సెంటర్, ఆనం వెంకటరెడ్డి విగ్రహం సెంటర్ మీదుగా అనిల్ గార్డెన్ వరకు సాగింది. నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, ఆయన సోదరుడు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి పాదయాత్రకు స్వాగతం పలికారు. ఆయా సభల్లో లోకేష్ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికి దోచుకోవడం తప్ప ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై శ్రద్ధ లేదన్నారు. రాష్ట్రంలో రోడ్లు అధ్వానంగా ఉన్నాయన్నారు. కాంట్రాక్టర్లకు రూ.లక్ష కోట్ల బకాయిలు పెండింగ్‌లో ఉండటంతో పలుమార్లు టెండర్లు పిలిచినా ఎవరూ ముందకు రావడంలేదని తెలిపారు. టిడిపి అధికారంలోకి వచ్చాక గుండ్లపాడు నుంచి కృష్ణపట్నం ఓడరేవు రోడ్డును నాలుగు లైన్లుగా విస్తరిస్తామని హామీ ఇచ్చారు. పాదయాత్రలో టిడిపి పోలిట్‌బ్యూరో సభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, ఆనం రామనారాయణరెడ్డి, ఆనం రంగమయూర్‌రెడ్డి, ఆనం శుభకర్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

శ్రీధర్‌రెడ్డికి స్వల్ప అస్వస్థత

ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి స్వల్ప అస్వస్థతకు గురయ్యారు. నారా లోకేష్ యువగళం పాదయాత్రలో ఆయన పాల్గొన్నారు. కాకుపల్లి నుంచి ధనలక్ష్మీపురం వరకు పాదయాత్రలో లోకేష్ వెంట నడిచారు. ఎక్కువసేపు విశ్రాంతి తీసుకోకపోవడంతో స్వల్ప అస్వస్థతకు గురవ్వడంతో అక్కడ నుంచి వెళ్లిపోయారు.



టిపిఎస్‌కె రౌండ్‌టేబుల్ సమావేశానికి హాజరైన నేతలు

ట్రోలింగ్స్ ముఠాపై డిజిటల్ వార్

- స్పందించే తత్వాన్ని కోల్పోవద్దు
- సాటి మనిషికి బాసటగా నిలవాలి
- టిపిఎస్‌కె రౌండ్‌టేబుల్ సమావేశంలో వక్తలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా మాట్లాడుతున్న పౌరసంఘాల నేతలు, ప్రజాస్వామికవాదులు, జర్నలిస్టులపై ట్రోలింగ్ చేస్తున్నారు. ముఖ్యంగా బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్‌పై కామెంట్స్ చేస్తే ట్రోల్ చేస్తున్నారు. ట్రోలర్స్‌పై ప్రజాస్వామికవాదులు, ప్రజాసంఘాల నేతలు, పౌరసంఘాల నేతలు, జర్నలిస్టులు, విశాల వేదికగా ఏర్పడి మనం కూడా డిటిజల్ వార్ చేయాలి' అని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. జర్నలిస్టు తులసీచందుపై జరుగుతున్న దాడి నేపథ్యంలో టిపిఎస్‌కె ఆధ్వర్యంలో భూపతి వెంకటేశ్వర్లు అధ్యక్షతన 'ప్రశ్నించే స్వరాలపై..మతోన్మాద దాడులు' అంశంపై హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆదివారం రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సినీగేయ రచయిత సుద్దాల అశోక్‌తేజ మాట్లాడుతూ ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు రాజ్యాన్ని, పాలకులు, ఏలికలను పాటల ద్వారా ప్రశ్నిస్తున్నానని అన్నారు. సినిమాల్లోనూ పాటల ద్వారా ప్రశ్నిస్తూనే ఉన్నానని తెలిపారు. ప్రశ్నిస్తే ట్రోలింగ్, దాడులు చేయడం సమాజానికి ప్రమాదకరమన్నారు. ప్రొఫెసర్ హరగోపాల్ మాట్లాడుతూ సాటి మనిషిపై దాడి చేస్తున్న స్పదించడంలేదనీ, 'అయ్యోపాపం' అనే మానవత్వాన్ని మంటగలిసిందని, ఇది ప్రమాదకరమని అన్నారు. పోరాటాలు, ఉద్యమాల ద్వారా తామున్నామనే విశ్వాసాన్ని కల్పించాలనీ, అందుకు అన్ని సంఘాలు ఏకతాటిపైకి రావాల్సిన అవసరముందని పిలుపునిచ్చారు. స్పందించే తత్వాన్ని పెంపొందించేందుకు ప్రజల సమ్మతి అవసరమని, దీనికోసం ప్రజల వద్దకు వెళ్లాలని సూచించారు. ప్రొఫెసర్ కాత్యాయని విద్మహే మాట్లాడుతూ బిజెపి విధానాలను విశ్లేషించి ప్రజలకు అవగాహన కల్పిస్తున్న తులసీచందును మతం పేరుతో ట్రోల్ చేస్తున్నారని తెలిపారు. సమాజంలో మహిళలను గౌరవించే పద్ధతి లేదని విమర్శించారు. సీనియర్ జర్నలిస్టు సజయ మాట్లాడుతూ ట్రోలింగ్ కొత్తేమికాదని, పీఓడబ్ల్యూ సంధ్య, సామాజిక కార్యకర్త దేవిలపై నిరంతరం ట్రోలింగ్ జరుగుతూనే ఉందని ఆందోళన వ్యక్తంచేశారు. మతోన్మాద, ఫాసిస్టు శక్తులను ఎదుర్కోవాలంటే కలిసికట్టుగా యుద్ధం ప్రకటించాలని పిలుపునిచ్చారు. అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య జాతీయ కన్వీనర్ విమలక్క మాట్లాడుతూ ప్రశ్నిస్తున్న వారిని ట్రోల్ చేయడం దుర్మార్గమైన చర్య అని అన్నారు. మహిళలను కించపరిచేవిధంగా ఫాసిస్టు శక్తులకు బుద్ధి చెప్పాలంటే కార్యాచరణ రూపొందించాలని సూచించారు. అంతకుముందు టిపిఎస్‌కె నాయకులు భూపతి వెంకటేశ్వర్లు 'ప్రశ్నించే గొంతులను కాపాడుకుందాం-ట్రోలింగ్ ముఠాలను కఠినంగా శిక్షించాలి' అంటూ తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. ఈ కార్యక్రమంలో విజ్ఞాన దర్శిని నాయకులు టి.రమేష్, సీనియర్ జర్నలిస్టు కల్లూరి భాస్కర్, విరసం నాయకులు వివేరా, రచయిత మెట్టురవి, తెలంగాణ సాహితి నాయకులు నరసింహ్మా, కవి ఎల్లయ్య, ఎరుక సాహితి వేదిక నాయకురాలు దాసోజు లలిత, దళిత లిబరేషన్ సమితి నాయకులు మార్వాడీ సుదర్శన్, మానవ వికాస వేదిక నాయకులు హన్మంతరావు, జర్నలిస్టు మురహరి పాల్గొని మాట్లాడారు.

హైదరాబాద్‌లో భారీ వర్షం

- రోడ్లన్నీ జలమయం

ప్రజాశక్తి-హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్ నగరంలోని పలు ప్రాంతాల్లో ఆదివారం రాత్రి భారీ వర్షం కురిసింది. కుండపోతగా కురిసిన వర్షానికి రహదారులు జలమయమయ్యాయి. ఖైరతాబాద్, కోఠి, సుల్తాన్ బజార్, బేగంబజార్, అబిడ్స్, నాంపల్లి, బషీర్ బాగ్, లక్డీకాపూల్, సైఫాబాద్, లిబర్టీ, హిమాయత్ నగర్, నారాయణ గూడ, ట్యాంక్ బండ్, దిల్‌సుఖ్‌నగర్, ఎల్బీనగర్, వనస్థలిపురం, హయత్‌నగర్‌లో భారీ వర్షం కురిసింది. ఒక్కసారిగా పడిన వర్షానికి వాహనదారులు తడిసి ముద్దయ్యారు. వర్షం నుంచి తడవకుండా ఉండేందుకు లిబర్టీ వంతెన, మెట్రో వంతెనల కిందకు భారీగా చేరారు.

ఉద్యమాలకు ప్రేరణ 'ది మేంగో లేడీ'

- పుస్తకావిష్కరణలో వక్తలు

ప్రజాశక్తి - సీతమ్మధార (విశాఖపట్నం)

'ది మేంగో లేడీ' నవల ఉద్యమాలకు ప్రేరణగా తోడ్పడుతుందని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. హిందూ సబ్ ఎడిటర్ మల్లాజోస్యుల అనుపమ పద్మజ రాసిన 'ది మేంగో లేడీ' ఆంగ్ల పుస్తకావిష్కరణ కార్యక్రమం విశాఖ నగరంలోని పౌర గ్రంథాలయంలో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఆదివారం జరిగింది. తొలుత ఈ పుస్తకాన్ని సోంపేట థర్మల్ ప్లాంట్ వ్యతిరేక పోరాట యోధురాలు జ్యోతి అతిథులతో కలిసి ఆవిష్కరించారు.

అనంతరం ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గం పూర్వ ఎమ్మెల్సీ ఎంవిఎస్.శర్మ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ద్రవిడ యూనివర్సిటీ పూర్వ వైస్ ఛాన్సలర్ కెఎస్.చలం మాట్లాడుతూ.. 'ది మేంగో లేడీ' పుస్తకంలో ఒక సాధారణ మహిళ ఎదుర్కొన్న సమస్యలనూ, జీవిత అనుభవాలను చెబుతూ అద్భుతంగా 250 పేజీలు రాయడం గొప్ప విషయమన్నారు. నెలసరి అయ్యిందన్న కారణంతో సదరు మహిళ ఊరు నుంచి గెంటివేయబడిన తరువాత అనుభవించిన కష్టాలను రచయిత్రి పుస్తకంలో పొందుపరిచారని తెలిపారు. ఆంధ్రా యూనివర్సిటీ రిటైర్డ్ ప్రొఫెసర్ డాక్టర్ ఎం.నళిని మాట్లాడుతూ శ్రీకాకుళంలో ఒక మహిళకు జీవితంలో ఎదురైన సంఘటనలను ఆధారంగా తీసుకుని రాసిన ఈ పుస్తకం స్ఫూర్తిదాయకంగా ఉందన్నారు. ఏ గ్రామస్తులయితే తనను ఊరు నుంచి గెంటివేశారో, అదే గ్రామస్తులకు తన పేరు మీద ఉన్న ఆస్తులు ఇవ్వడానికి వచ్చి.. ఆ గ్రామస్తుల్లో మార్పు తేవాలన్న ఉద్దేశంతో తీసుకున్న నిర్ణయం ఆధారంగా ఈ పుస్తకం రూపుదిద్దుకుందని తెలిపారు. రచయిత్రి నుంచి ఇటువంటి మరిన్ని పుస్తకాలు రావాలని ఆకాంక్షించారు. సోంపేట థర్మల్ ప్లాంట్ వ్యతిరేక పోరాట యోధురాలు జ్యోతి మాట్లాడుతూ ఉత్తరాంధ్రలోని అనేక సమస్యలను పుస్తకాల రూపంలోకి తేవాల్సి ఉందన్నారు. 'ది మేంగో లేడీ' పుస్తకాన్ని తెలుగులోకి అనువదించాలని సూచించారు. జెవివి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.మురళీధర్, సాహితీవేత్తలు అట్టాడ అప్పలనాయుడు, శ్రీనివాసులు మాట్లాడుతూ ఉత్తరాంధ్ర వర్తమాన, సామాజిక జీవితపు వాస్తవ చిత్రీకరణలను నవలలో పొందుపరిచారని తెలిపారు. పుస్తక రచయిత్రి అనుపమ పద్మజ మాట్లాడుతూ ఉత్తరాంధ్ర సమస్యలను నిత్యం గ్రహిస్తూ పలువురితో మాట్లాడి ఓ మహిళ జీవితంలో జరిగిన సంఘటనలను ఆధారంగా తీసుకుని పుస్తకాన్ని రచించినట్టు చెప్పారు. కేన్సర్ బారిన పడి చనిపోయిన తన స్నేహితురాలు సంధ్యను స్మరణకు తెచ్చుకున్నారు. ఆమె జయంతిని పురస్కరించుకుని కార్యక్రమానికి ముందు ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.



'ది మేంగో లేడీ' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అతిథులు

నిధుల దారిమళ్లింపుపై పిఆర్ కమిషనర్ సమాధానం చెప్పాలి

- వైవిబి రాజేంద్రప్రసాద్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో



సర్పంచ్‌ల సంతకం లేకుండా నిధులను దొంగతనంగా దారిమళ్లించిన ఘటనపై పంచాయతీరాజ్ కమిషనర్ లిఖిత పూర్వకంగా సమాధానం చెప్పాలని ఎపి పంచాయతీరాజ్ ఛాంబర్ అధ్యక్షులు వైవిబి రాజేంద్రప్రసాద్, రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం అధ్యక్షులు వి. లక్ష్మీముత్యాలరావు, పంచాయతీరాజ్ ఛాంబర్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బిర్రు ప్రతాప్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ ఎ.సూర్యకుమారి లెటర్ నెంబరు 1809293 తేదీ 01.07.2023ను ప్రకటనను తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. సర్పంచ్‌ల సంతకం లేకుండా సర్పంచ్‌ల నిధులను దారిమళ్లించిన రూ.8,660 కోట్లపై కమిషనరు సమాధానం చెప్పాల్సిందేనన్నారు. జులై 1న ఎపి పంచాయతీరాజ్ కమిషనరు 2022-23 సంవత్సరానికి గాను 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.2010 కోట్లకు గాను, రూ.988 కోట్లను కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిందని, వాటిని త్వరలో సర్పంచ్‌ల పిఎఫ్ ఎంఎస్ ఖాతాలో జమచేస్తామని, రెండో విడత నిధులకు ప్రతిపాదనలు పంపుతామని కమిషనరు సమాధానం ఇవ్వడాన్ని తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని పేర్కొన్నారు. సర్పంచ్‌లకు హక్కుగా రావాల్సిన రూ.12,690 కోట్లను సర్పంచ్‌ల ఖాతాల్లో జమ చేసే వరకు రాజీలేని పోరాటం చేస్తామని వైవిబి రాజేంద్రప్రసాద్ తెలిపారు.



పాదయాత్రలో నడుస్తున్న వి.శ్రీనివాసరావు



కళాకారుల ఆటాపాట



పాదయాత్రలో యువత

భవిత కోసమే 'పోరుకేక'

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై నిర్వాసిత యువత ఆగ్రహం

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

తమకు, తమ కుటుంబాలకు ఇప్పటి వరకూ జరిగిన అన్యాయంపై 'పోలవరం పోరుకేక మహా పాదయాత్ర' ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను నిర్వాసిత యువత ప్రశ్నిస్తోంది. దండుకట్టి పోరాటానికి ముందుకు ఉరుకుతోంది. పోలవరం జాతీయ ప్రాజెక్టు అయినా ఆర్ అండ్ ఆర్‌కు నిధులు ఇవ్వడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైంది. ప్రాజెక్టు నిర్మాణం కోసం భూములు, ఇళ్లను త్యాగం చేస్తున్న నిర్వాసితులకు అండగా నిలుస్తానని ప్రతిపక్ష నేతగా పాదయాత్ర సందర్భంగా వైఎస్.జగన్మోహన్‌రెడ్డి హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చి నాలుగేళ్లు గడిచినా ఏ ఒక్క హామీనీ నెరవేర్చలేదు. గతేడాది వచ్చిన వరదల సమయంలో బాధితులకు కేవలం రూ.2 వేల నగదు, నాలుగు రకాల కూరగాయలు ఇచ్చి ప్రభుత్వం చేతులు దులుపుకుంది. ఈ నేపథ్యంలో నిర్వాసితుల సమస్యల పరిష్కారం కోరుతూ పోలవరం పోరుకేక మహా పాదయాత్ర సాగుతోంది. గత 12 రోజులుగా సుమారు 300 కిలోమీటర్లుకుపైగా దూరం నడిచి రాష్ట్ర రాజధానికి తరలివస్తున్నారు. వారిని 'ప్రజాశక్తి' పలకరించగా తమకు తమ కుటుంబాలకు జరిగిన అన్యాయాన్ని, నేడు జరుగుతున్న పోరాటాన్ని, అనుభవాలను వివరించారు. వారి మాటల్లోనే..

కుంజా బొజ్జి, సున్నం రాజయ్యల స్ఫూర్తితో...



పోలవరం ముంపు మండలాల ప్రజల కోసం మాజీ ఎమ్మెల్యేలు కుంజా బుజ్జి, సున్నం రాజయ్యలు చేసిన పోరాటాలను స్ఫూర్తిగా తీసుకొని 12 రోజులుగా యాత్రలో నడిచి వస్తున్నాను. ఈ ప్రాజెక్టు నిర్మాణం పూర్తయితే గిరిజనులకు జరిగే నష్టాన్ని ఆనాడే ఆ మహనీయులు వివరించారు. గత వరదలకు మా ఇల్లు నేలమట్టమైంది. ఇప్పటికీ తేరుకోలేకపోయాం. నాలానే అనేక కుటుంబాలు దయనీయ పరిస్థితుల్లో ఏడాదిగా జీవనం గడుపుతున్నాయి.

-మడకం లక్ష్మణరావు, అడవి వెంకన్నగూడెం, విఆర్.పురం మండలం

వృద్ధురాలైన అమ్మను ఒంటరిగా వదిలి...



వృద్ధురాలైన అమ్మను ఒంటరిగా వదిలి పాదయాత్రలో కలిసి వస్తున్నాను. ఈ యాత్ర గోదావరి నిర్వాసితుల గొంతుక అని చెప్పడంలో ఎటువంటి సందేహమూ లేదు. ఆరోగ్య సమస్యలు వెంటాడుతున్నా కష్టాల నుంచి బయటపడేందుకే ఈ పోరాటంలో నడిచి వస్తున్నాను. డిఇడి పూర్తి చేసిన నేను వ్యవసాయ కార్మికునిగా పని చేస్తూ అమ్మను పోషించుకుంటున్నాను. రాష్ట్ర ప్రభుత్వం డిఎస్‌సి తీయకపోవడంతో విలీన మండలాల్లో నాలానే అనేకమంది యువత ఉపాధి పనులు, వ్యవసాయ పనులు చేసుకుంటూ కాలం గడుపుతోంది.

-ఎం.దారమ్మ, అడవి వెంకన్న గూడెం, విఆర్.పురం మండలం

ప్రశ్నించేందుకే వచ్చాం



మా న్యాయమైన హక్కుల కోసం ప్రభుత్వాన్ని ప్రశ్నించేందుకు పోలవరం పోరుకేక మహా పాదయాత్ర వేదికైంది. అందుకే మా కుటుంబం నుంచి నాన్న, నేను ఇద్దరం కలిసి యాత్రలో పాల్గొంటున్నాం. పోలవరం నిర్వాసితులను గతేడాది ముంచేసింది గోదావరి వరద కాదు.. ప్రాజెక్టు వరద. నాడు మా ఇల్లు పూర్తిగా దెబ్బతింది. ప్రభుత్వం నుంచి వరద సాయం అందలేదు. సుదీర్ఘకాలం ఇటువంటి పరిస్థితులు ఎదుర్కొంటూ జీవనం గడపడం లేము.

-గొర్రె ఠాగూర్, మల్లెతోట, చింతూరు మండలం

మహా పాదయాత్రలో నేను సైతం

సిఎం మాట తప్పారు. నాడు ప్రతిపక్ష నేతగా మా ప్రాంతంలో పర్యటించారు. ప్రాజెక్టు కోసం భూములు త్యాగం చేసిన మాకు న్యాయం చేస్తానని భరోసా ఇచ్చారు. అవన్నీ ఉత్తిమాటలుగానే మిగిలాయి. గత వరదలు నాటి దుర్భర పరిస్థితులు మా కళ్లముందు కదులుతూనే ఉన్నాయి. ప్రభుత్వం నుంచి కనీసం వరద సాయం కూడా అందలేదు. పోరుకేక మహా పాదయాత్ర ద్వారా ప్రభుత్వంపై నిరసన తెలిపేందుకు నేను సైతం అంటూ పాదయాత్రకు కదిలి వచ్చాను.



-సోడి సింగమ్మ, గూడూరు, చింతూరు మండలం

ప్రభుత్వాన్ని నిలదీస్తాం



పోలవరం ప్రాజెక్టు నిర్మాణంతో ముంపు మండలాల్లో నివసిస్తున్న యువత భవిష్యత్తు అంధకారంగా మారింది. వారసత్వంగా మాకు ఐదు ఎకరాల భూమి ఉంది. మిర్చి సాగు చేసుకుంటూ మా కుటుంబం జీవనోపాధి పొందుతుంది. పునరావాసం కల్పించలేదు. ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ చెల్లించలేదు. ప్రాజెక్టు నిర్మాణం పూర్తి చేసి మమ్మల్ని గోదాట్లో ముంచేస్తున్నారు. అడవి నుంచి మమ్మల్ని దూరం చేస్తున్నారు. ఎక్కడికి వెళ్లాలి? ఏమి తిని బతకాలి? ఈ ప్రశ్నలు నాలాంటి యువతను వెంటాడుతున్నాయి.

-మడకం నాగమణి, రేపాక, కూనవరం మండలం

ఎంతవరకైనా పోరాటం



మాకు పరిహారం, పునరావాసం లభించే వరకూ పోరాటాన్ని ఆపేది లేదు. 13 రోజులుగా ఈ యాత్రలో నడిచి వస్తున్నాను. ఆరోగ్య సమస్యలు వెంటాడుతున్నా, అది గోదావరి ముంపును మించినది కాదు. కేంద్రం, రాష్ట్రం నాటకాలు ఆడుతున్నాయి. హామీలను నెరవేర్చలేదు.

-సోడే సుమన్, బొజ్జరాయి గూడెం, కూనవరం మండలం

రాళ్లు... ముళ్లు.. దాటుకుంటూ



రాళ్లు.. ముళ్లు.. దాటుకుంటూ విజయవాడకు చేరబోతున్నాం. ఇప్పటివరకు సుమారు 300కుపైగా కిలోమీటర్లు కాలినడకన నడిచాను. మహిళను కావడంతో ప్రత్యేక సమస్యలు ఉంటాయి. ఆ సమస్యలను సైతం తట్టుకుని ముందుకు వెళుతున్నాను. నాలానే వందలాది మంది మహిళలు ఈ యాత్రలో భాగస్వాములయ్యారు.

-పదం నిర్మల, జగ్గారం గ్రామం, ఎటపాక మండలం


ప్రతి కుటుంబం నుంచీ పోరుకేక



పోలవరం ప్రాజెక్టు నిర్మాణంతో సర్వం కోల్పోతున్నాం. ప్రభుత్వం ఇప్పటికీ మాకు పునరావాసం, భూమికి భూమి, ఆర్ అండ్ ఆర్ పరిహారం చెల్లించలేదు. గ్రామాలను ఖాళీ చేయించే నాటికి 18 సంవత్సరాల నిండిన యువతకు ఆర్ అండ్ ఆర్ ఇస్తామని చెప్పారు. ఆచరణలో మాట తప్పారు.

-కాకా సాయి భగవాన్, మురుమూరు గ్రామం, ఎటపాక మండలం

గోదాట్లో ముంచేస్తే సహించేది లేదు



పరిహారం, పునరావాసం చెల్లించ కుండా గోదాట్లో ముంచేస్తానంటే సహించేది లేదు. గోదావరి వరదల కారణంగా నా రెండున్నర ఎకరాల వ్యవసాయ భూమి సాగుకు దూరమైంది. ఆర్థికంగా చితికిపోవడంతో పెట్టుబడి పెట్టే పరిస్థితులు కూడా లేవు. మా భవిష్యత్తు కాంతిరేఖ ఈ పాదయాత్ర.

-కరటం ప్రకాష్, కొత్తూరు, వేలేరుపాడు మండలం

మా భవిష్యత్తు కోసం పోరాటం



అధికారుల లెక్కల ప్రకారం మా గ్రామం 45వ కాంటూరు పరిధిలో ఉంది. గతేడాది వచ్చిన వరదలకు పూర్తిగా ముంపునకు గురైంది. నాకు ఊహ తెలిసిన తర్వాత ఈ స్థాయిలో వరద రావడం అదే మొదటిసారి. రెండు వారాలు బిక్కుబిక్కుమంటూ జీవనం గడిపాం. ప్రతి ఏటా చస్తూ బతకడం కష్టం కదా. ఇంటర్మీడియట్ పూర్తి చేశాను. డిగ్రీ అడ్మిషన్ తీసుకున్నాను. కాలేజీకి వెళ్లాలి. మా భవిష్యత్తు కోసం జరిగే పోరాటం కావడంతో మా కుటుంబం మొత్తం యాత్రలో కలిసి వస్తోంది.

-కుంజా కావ్య, వసంతవాడ, వేలేరుపాడు మండలం

మహాధర్నాలో నిలదీయనున్నాం

ఆదివాసీలను అడవికి దూరం చేస్తే ఎలా బతకగలం. ప్రాజెక్టుతో మా కుటుంబానికి వారసత్వంగా వచ్చిన 20 ఎకరాల సాగు భూమి కోల్పోతున్నాం. ప్రభుత్వం ఇప్పటి వరకూ పరిహారం చెల్లించలేదు. పాలకులను నిలదీసేందుకు జరిగే ఈ పోరాటంలో మా గ్రామం నుంచి అందరం భాగస్వాములయ్యాం.

-పి.నూకరాజు, పాతదాచారం, కుక్కునూరు మండలం

ప్రభుత్వ నిర్లక్ష్యంపై పోరాటం



తరతరాలుగా భూమిని నమ్ముకుని వ్యవసాయం చేసుకుంటూ మా కుటుంబాలు జీవనోపాధి పొందుతున్నాయి. ప్రాజెక్టు నిర్మాణంతో ఇల్లు, భూములు కోల్పోతున్నాం. నాపై ఆధారపడి భార్య, పాప, బాబు ఉన్నారు. ఎలా బతకాలో అర్థం కావడం లేదు. ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని ప్రశ్నించేందుకే ఈ పోరాటం. దీనిలో నేను భాగస్వామినవడం ఆనందంగా ఉంది.

-మేడిపల్లి బాబు, మాధవరం, కుక్కునూరు మండలం

ఉరిమే ఉత్సాహంతో...



పోలవరం నిర్వాసితుల పోరుకేక మహా పాదయాత్రలో యువత ఉరికే ఉత్సాహంతో కలిసి వస్తోంది. 13 రోజులుగా వందలాది మంది యువత యాత్రలో భాగస్వామవడంతోపాటు సంప్రదాయ నృత్యాలు ప్రదర్శిస్తూ ప్రత్యేక ఆకర్షణగా మారింది. ముఖ్యంగా మహిళలకు నెలసరి సమస్యలు ఉన్నప్పటికీ ఈ యాత్రలో మనోధైర్యంతో కలిసి వస్తున్నారు. వారి భవిష్యత్తు కోసం జరిగే ఈ పోరాటంలో కష్టాలను దాటుకుంటూ ముందడుగు వేస్తున్నారు. 18 సంవత్సరాలలోపు వారు కూడా ఈ యాత్రలో ఉన్నారు. కొంతమంది మహిళలు చిన్నపిల్లలను ఇంటి వద్ద వదిలి ఈ యాత్రలో భాగస్వాములయ్యారు. ఈ పోరాటం ఓ మైలురాయిగా నిలవనుంది.

-మొడియం నాగమణి, సిపిఎం ఏలూరు జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు

పోరాటంలో యువతదే కీలక పాత్ర



పోలవరం నిర్వాసితుల హక్కుల కోసం జరిగే ఈ పోరాటంలో యువత కీలక పాత్ర పోషిస్తోంది. ముంపు మండలాల నుంచి వేలాది మంది యువత తరలివస్తున్నారు. గ్రామాలను ఖాళీ చేయించే నాటికి 18 సంవత్సరాలు లెక్కగా తీసుకోవాల్సిన స్థానంలో నోటిఫికేషన్ ప్రక్రియను ప్రామాణికంగా ప్రభుత్వం తీసుకుంటోంది. దీనివల్ల మిగిలిన మండలాల్లో సుమారు 1500కు పైగా యువత నష్టపోతున్నారు.

-పులి సంతోష్, గిరిజన సంఘం రంపచోడవరం జిల్లా కార్యదర్శి

అంగన్‌వాడీ వర్కర్‌ను వేధించిన వైసిపి నేతలను అరెస్ట్ చేయాలి

- అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

అంగన్‌వాడీ కార్యకర్తను వేధింపులకు గురిచేసి, ఆమె ఆత్మహత్యాయత్నానికి కారణమైన వైసిపి నాయకులను వెంటనే అరెస్టు చేయాలని ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి.బేబీరాణి, కె.సుబ్బరావమ్మ డిమాండ్ చేశారు. కృష్ణాజిల్లా పామర్రు ప్రాజెక్టు పరిధిలోని పారుపూడి మండలం గురివిందగుంట గ్రామానికి చెందిన అంగన్‌వాడీ వర్కర్ అన్నపూర్ణను వేధింపులకు గురిచేసిన వైసిపి నాయకులు వేమూరి మోహన్, వేమూరి సత్యనారాయణ, దారం జోజిబాబును వెంటనే అరెస్ట్ చేయాలని కోరారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు.

23న అగ్నికుల క్షత్రియుల ప్రజాసింహగర్జన

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

అగ్నికుల క్షత్రియులకు న్యాయం చేయాలని కోరుతూ విజయవాడలో ఈనెల 23న రామచంద్ర యాదవ్ నాయకత్వాన ప్రజా సింహగర్జన సభ నిర్వహించనున్నట్లు అగ్నికుల క్షత్రియ జాతీయ అధ్యక్షులు నాగిడి సాంబశివరావు పేర్కొన్నారు. హైదరాబాద్ ఫిలిమ్‌నగర్‌లోని ఫంక్షన్ హాలులో సాంబశివరావు, ప్రతినిధుల బృందం రామచంద్ర యాదవ్‌ను ఆదివారం కలిసి తమ సమస్యలను వివరించారు. ఆయనను కలిసిన వారిలో తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు గాడి రామకృష్ణ, ప్రధాన కార్యదర్శి జల్లా రామచంద్రరాజు, ఉపాధ్యక్షులు గాడి రవి, సేరు రాజు, కోశాధికారి గాడి నరసింహస్వామి, జాయింట్ సెక్రటరీ బస్వాని చంద్రశేఖర్ తదితరులు ఉన్నారు.

ఆరోగ్యశ్రీపై అసత్య ఆరోపణలు

- పథకం అమలుపై బహిరంగ చర్చకు సిద్ధమా..?
- చంద్రబాబు, లోకేష్‌లకు మంత్రి రజిని సవాల్

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

ఆరోగ్యశ్రీ పథకంపై బహిరంగ చర్చకు సిద్ధమా అని టిడిపి అధినేత చంద్రబాబు నాయుడుతో పాటు ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌కు రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని సవాల్ విసిరారు. గుంటూరులోని ఇన్‌స్పెక్షన్ బంగ్లాలో ఆమె ఆదివారం సాయంత్రం మీడియాతో మాట్లాడారు. ఆరోగ్యశ్రీపై చంద్రబాబు, లోకేష్ అర్థం లేని ఆరోపణలు చేస్తున్నారని, టిడిపి హయాంలోనే ఆరోగ్యశ్రీని అనారోగ్యశ్రీగా మార్చారని విమర్శించారు. టిడిపి ప్రభుత్వంలో కేవలం 919 ఆస్పత్రుల్లోనే ఆరోగ్యశ్రీ సేవలు అందేవని తెలిపారు. రోజుకు సగటున 1570 మందికే ఆరోగ్యశ్రీ ద్వారా ఉచిత వైద్యం అందిందని, 1057 ప్రొసీజర్లకు మాత్రమే చికిత్స అందించారని పేర్కొన్నారు. ఏడాదికి సగటున రూ.వెయ్యి కోట్లే ఖర్చు చేశారని విమర్శిం చారు. గత నాలుగేళ్లలో రోజుకు సగటున ఏకంగా 3400 మంది రాష్ట్రంలో ఆరోగ్యశ్రీ ద్వారా చికిత్స పొందుతున్నారని, ఈ ఒక్క ఏడాదే రూ.3400 కోట్లు ఖర్చు చేస్తున్నామని వివరించారు. ఆరోగ్యశ్రీ ప్రొసీజర్లను 3257కు పెంచామన్నారు. 2014 నుంచి 2019 వరకు ఆరోగ్యశ్రీ అమలు విధానం, 2019-23 వరకు అమలు చేసిన తీరుపై చంద్రబాబు, లోకేశ్ బహిరంగ చర్చకు రావాలని సవాల్ విసిరారు.

అప్పలరాజు అక్రమాలకు అడ్డులేదు

- అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పలాస నియోజకవర్గంలో మంత్రి సీదిరి అప్పలరాజు అక్రమాలకు అడ్డూఅదుపు లేకుండా పోయిందని టిడిపి రాష్ట్ర అధ్యక్షులు అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. అక్రమంగా అరెస్టు చేసిన టిడిపి నాయకులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పలాస - కాశీబుగ్గ మున్సిపాల్టీలో టిడిపి నేత నాగరాజు ఇంటిముందు ఉన్న కల్వర్టు కూల్చివేయటం దుర్మార్గమని ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జగన్ ప్రభుత్వంలో నిర్బంధం, అణచివేతలు, వేధింపులు, రౌడీయిజం తారాస్థాయికి చేరాయని తెలిపారు. మంత్రి అప్పలరాజు అక్రమాలను నిరంతరం ఎండగడుతున్నందుకే నియోజకవర్గంలో టిడిపి నేతలపై కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్నారని విమర్శించారు. ఇల్లు కూల్చివేసిన బాధితులను పరామర్శించేందుకు వెళ్తున్న టిడిపి నేతలను పోలీసులు అడ్డుకోవడం సిగ్గుచేటని పేర్కొన్నారు.

ఇద్దరు కూతుళ్లతో సహా చెరువులో దూకి తల్లి ఆత్మహత్య



మృతి చెందిన తల్లి, ఇద్దరు కూతుళ్లు

ప్రజాశక్తి-ముదిగబ్బ

ఓ మహిళ తన ఇద్దరు కూతుళ్లతో సహా చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్న ఘటన శ్రీ సత్యసాయి జిల్లా ముదిగుబ్బ మండల కేంద్రంలో ఆదివారం చోటు చేసుకుంది. కుటుంబ కలహాల నేపథ్యంలోనే ఆమె ఈ అఘాయిత్యానికి పాల్పడినట్లు తెలుస్తోంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... కదిరి మండలం కుటాగుళ్ల గ్రామానికి చెందిన సుకన్య (25)కు నల్లమాడకు చెందిన గంగాధర్‌రెడ్డికి ఎనిమిదేళ్ల క్రితం వివాహమైంది. వీరికి దేవయాని (7), చెస్మిత (5) ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. గంగాధర్ టైలరింగ్ పనులు చేస్తుండేవారు. సుకన్య కూలి పనులకు వెళ్లేవారు. గత కొంతకాలంగా భార్యాభర్తల మధ్య చిన్నపాటి మనస్పర్థలతో కలహాలు చోటు చేసుకున్నాయి. ఆదివారం ఉదయం కూడా భార్యాభర్తలు ఇద్దరూ ఘర్షణ పడ్డారు. దీంతో తీవ్ర మనస్తాపానికిలోనై దేవయాని తనతో పాటు ఇద్దరు కూతుళ్లనూ వెంట తీసుకుని ఇంటి నుంచి వెళ్లారు. ముదిగుబ్బ సమీపంలోని చెరువు వద్దకు వెళ్లి ముందుగా తన చిన్న కూతురు చెస్మితను చెరువులోకి విసేరేసింది. ఇది చూసిన పెద్ద కూతురు దేవయాని భయపడి పారిపోతుండగా ఆ పాపనూ బలవంతంగా ఎత్తుకుని ఆమె చెరువులోకి దూకింది. చెరువు గట్టు సమీపంలో ఇదంతా చూస్తున్న కొందరు గొర్రెల కాపరులు అక్కడికి హుటాహుటిన వచ్చి వారిని కాపాడేందుకు ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. సమాచారం అందుకున్న ముదిగుబ్బ ఎస్ఐ హేమంత్ కుమార్ సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి చేరుకున్నారు. గొర్రెల కాపరులు, గజ ఈతగాళ్ల సాయంతో నీటిలో ఉన్న ముగ్గురినీ బయటకు తీశారు. అప్పటికే వారు మరణించారు. ఘటనపై పూర్తి స్థాయి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మచిలీపట్నం 36వ వార్డు కార్పొరేటర్‌ను అరెస్ట్ చేయాలి

ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

మచిలీపట్నం మున్సిపల్ కార్పొరేషన్‌లో దీర్ఘకాలంగా పనిచేస్తున్న పారిశుధ్య కార్మికుడు ఎర్రంశెట్టి వీర్రాజు ఆత్మహత్మాయత్నానికి కారకుడైన వైసిపి 36వ వార్డు కార్పొరేటర్ ఎం.రామ్‌ప్రసాద్‌ను వెంటనే అరెస్ట్ చేయాలని, ప్రభుత్వం తక్షణమే స్పందించి బాధితునికి మెరుగైన వైద్య సేవలు అందించాలని ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆదివారం ఫెడరేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.నాగభూషణ, కె.ఉమామహేశ్వరరావు ఒక ప్రకటన విడుదల చేశారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందన్నారు. ఈ సంఘటనపై ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.



ఘర్షణ పడుతున్న ఇరు గ్రూపుల నాయకులు

వైసిపి నాయకుల పరస్పర దాడులు

- ఓ వ్యక్తికి గాయాలు

ప్రజాశక్తి-టంగుటూరు



గాయపడిన శివసాయికుమార్

వైసిపి కొండపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి వరికూటి అశోక్ బాబు, మాజీ ఇన్‌ఛార్జి, పిడిసిసి బ్యాంకు చైర్మన్ డాక్టర్ మాదాసి వెంకయ్య అనుచరులు పరసర్పం దాడులకు పాల్పడ్డారు. దీంతో ఓ వ్యక్తికి గాయాలయ్యాయి. ఈ ఘటన టంగుటూరులో ఆదివారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... మాదాసి వెంకయ్య జిల్లా దక్షిణ బైపాస్ ఫ్లైఓవర్ సమీపంలోని జునో బేకరీ వద్ద సేద తీరుతున్నారు. అదే సమయంలో అశోక్ బాబూ అక్కడకు వచ్చారు. కొద్దిసేపటి తర్వాత వెంకయ్య వెళ్లేందుకు సిద్ధమయ్యారు. తన కారుకు అడ్డుగా అశోక్‌బాబు అనుచరుల బైకులు ఉన్నాయి. బైకులు పక్క తీయాలని వెంకయ్య సూచించారు. ఈ క్రమంలో వారి మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. చివరకూ ఉద్రిక్తతకు దారి తీసింది. ఇరుగ్రూపుల మధ్య జరిగిన తోపులాట, దాడిలో వెంకయ్య అనుచరుడు శింగరాయకొండకు చెందిన కుంచాల శివసాయికుమార్‌కు గాయాలయ్యాయి. దాడి గురించి సమాచారం అందుకున్న టంగుటూరు, జరుగుమల్లి ఎస్ఐలు షేక్ ఖాదర్ బాషా, వెంకటేశ్వరరావు తమ సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకొని ఇరు గ్రూపులను చెదరగొట్టారు. దాడిలో గాయపడిన శివకుమార్‌ను ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. ఇదివరకూ వారి ఇరువురి అనుచరులు ఒకటి రెండుసార్లు గొడవలు పడ్డారు. ఈసారి మాత్రం ప్రత్యక్షంగా వెంకయ్య, అశోక్‌బాబు మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది.



"కవి, రచయిత, కళాకారుడు
కళాత్మక విలువల్ని ఉత్పత్తి చేస్తూ...
అదే సమయంలో భావజాల
విలువల్ని కూడా ఉత్పత్తి చేస్తారు.."
- లెనిన్



ఒక్క కుదుపు కుదుపుతాను

నీక్కావాల్సింది
నా పతనమే అనుకుంటా
నేను అనంత విశ్వమైన ధైర్యాన్ని
నీక్కావాల్సింది
నా బానిసత్వం అనుకుంటా
నేను కుల, మతతత్వంపై
తిరగబడే అక్షరాన్ని
నేను సామాన్యుల గొంతుకను
కార్పొరేట్ కలల ప్రపంచానికి
ఉక్కు పిడికిలిని !

తుపాను రావొచ్చు, పోవొచ్చు
ఫోన్లో బెదిరింపులు హుంకరించవొచ్చు
ఇళ్ళపై దాడులు చేయొచ్చు
ఈ ప్రళయ విలయ బెదిరింపుల్లో
బాధితుల పక్షం నా గొంతు
నేను అక్షరాన్ని
వెనుదిరిగి అడుగు వేయను
నిజాన్ని నిర్భయంగా రాస్తాను
నేను సత్యాన్ని
సత్యం పలకడానికి
విషాన్ని సైతం సోక్రటిస్‌లా తాగుతాను!
బ్రూనో, కోపర్నికస్‌ల వారసురాలిని
కపట కౌటిల్యాల, మతతత్వ పోకడలను
ఒక్క కుదుపు కుదుపుతాను !
నేను
ఉరికొయ్యను ముద్దాడిన
భగత్ సింగ్, కెన్ సారోవివాల స్ఫూర్తిని!
నేను ప్రశ్నను
తిరిగి లేచే ఫినిక్స్ పక్షిని
నేను ధిక్కార నంగేలిని
సొజర్నర్ ట్రూత్‌ని, మాయో ఎంజిలోని, గౌరి లంకేష్‌ని

నేను ప్రజాస్వామ్యాన్ని
బాబా సాహెబ్ అంబేద్కర్
రాజ్యాంగ హక్కులతో పోరాడుతున్న
సామాన్య పోరాటాన్ని
నేను పీడితుల చైతన్య స్వరాన్ని
నేను తులసిచందును!

- తంగిరాల. సోని
9676609234



జీవించాలంటే ...

జీవితాలకేం ప్రయాణిస్తూనే ఉంటాయ్
ఒక్కోసారి సెకెన్ల ముల్లులా పరుగులు తీస్తాయ్
మరోసారి నిమిషాల ముల్లుతో పాటు
ఆచితూచి అడుగులు వేస్తూ
గంటల ముల్లుతో బద్ధకంగా
సోమరిగా కదులుతూ
కాలంతో పాటూ నడుస్తూనే ఉంటాయి
ఈ మనసే పరమదుర్మార్గపుది
జ్ఞాపకాల పుట్టని నిరంతరమూ తవ్వుతూ
జీవితం ముంగిట్లో ఆశలచెట్టు మొదల్నే
సారవంతం చేస్తున్నానంటుంది
కానీ, కాసిని చిరునవ్వు పువ్వుల్ని
ఎప్పుడో గానీ పెదాల మీద అలంకరించదు

జీవితంతో చేయి చేయి కలిపి
ఈ మనసు నడవకుండా
నడక దారంతా ముళ్ళు రాలుస్తూ
సాల్వడార్ కరిగిపోతున్న కాలం గురించి
కథలు కథలుగా చెప్పి
నిరుత్సాహపు పొరల్ని
కళ్ళ మీద పరిచి చెలమల్ని అద్దుతుంది !

ఎప్పుడో ఒకప్పుడు సమయం చూసి
ఈ దుర్మార్గపు మనసుని
ఒడుపుగా బంధించి
ఆలోచనల్ని ఎగిరిపోనీయకుండా
పిడికిట పట్టి మనసులో ఒంపి
పెంపుడు పిల్లిని చేసి మనవెనకే తిప్పుతూ
పక్కదార్లు పట్టనీకుండా
జీవితంతో చేతులు కలిపి నడవాల్సిందే
తప్పదు గాక తప్పదు !

- శీలా సుభద్రాదేవి
81068 83099

8న జానుడి పురస్కార సభ

జానుడి - సెంటర్ ఫర్ లిటరేచర్ అండ్ ఆర్ట్స్, మల్లవరపు మధుర సాహిత్య భారతి, ఒంగోలు, తెలంగాణా భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో మధుర కవి మల్లవరపు జాన్ స్మారక సాహిత్య పురస్కార సభ జులై 8వ తేదీ ఉదయం 10.30 గంటలకు హైదరాబాద్ రవీంద్ర భారతి కాన్ఫరెన్స్ హాలులో జరుగుతుంది. ఈ సభలో ప్రముఖ సాహితీ వేత్త, మీడియా విశ్లేషకులు డాక్టర్ నాగసూరి వేణుగోపాల్ (2020), ప్రముఖ కవి, సాహితీ వేత్త డాక్టర్ శిఖామణి (2021), ప్రముఖ కవి, అనువాదకులు ముకుంద రామారావు (2022)లకు పురస్కారాలు అందజేస్తాము.

- డాక్టర్ నూకతోటి రవికుమార్, మల్లవరపు ప్రభాకరరావు

7న నీలకురింజి సముద్రం ఆవిష్కరణ

డాక్టర్ ఎం.ప్రగతి రచించిన కవిత్వ సంపుటి 'నీలకురింజి సముద్రం' ఆవిష్కరణ జులై 7వ తేదీ ఉదయం 10 గంటలకు అనంతపురం ఆర్ట్స్ కళాశాల కామర్స్ సెమినార్ హాల్లో జరుగుతుంది. ప్రముఖ కవి, విమర్శకులు తూముచర్ల రాజారామ్ అధ్యక్షతన జరిగే ఈ కార్యక్రమంలో విరసం నాయకులు పాణి, సాహితీ స్రవంతి రాష్ట్ర అధ్యక్షులు కెంగార మోహన్, కవి, విమర్శకులు డాక్టర్ రాధేయ, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ దివాకర్ రెడ్డి, ఛాయ ప్రచురణకర్త అరుణాంక్ లత, కవయిత్రి శశికళ, హేమమాలిని తదితరులు పాల్గొంటారు.

- సాహితీ స్రవంతి, అనంతపురం.

తెలుగులో గజల్ సృష్టికర్త హబీబుల్లా జూకా


భారత సాహిత్యంలో గజల్‌కు విశేష ప్రాచుర్యముంది. కాస్త నెమ్మదిగానైనా తెలుగులో కూడా గజల్ సాహిత్యానికి పెద్దపీట లభించింది. దక్షిణ భారతంలో మొట్టమొదటగా ఉర్దు పర్షియన్ భాషల్లో గజల్స్ సృష్టించింది నెల్లూరీయుడు జూకా. జూకా అనేది కలం పేరు. యావత్ దక్షిణ భారతదేశంలోంచి గాలిబ్ మహాకవి ఏకలవ్య శిష్యుడితనే. ఉర్దూ, పర్షియన్ భాషల్లో గాలిబ్ శిష్యులు ఇంకెవరూ ఈ ప్రాంతం నుంచి లేరు. జూకా మరణించింది 1875వ సంవత్సరంలో. అయినా దాదాపు 100 సంవత్సరాలు అజ్ఞాత కవిగానే మిగిలిపోయారు. అసలు జూకా ఎవరు? జూకా గురించి చదివేముందు వారి పూర్వులను గురించి కొంత తెలుసుకోవాలి.

కళ్ళికోట యుద్ధానంతరం 1565లో ఉదయగిరి గోల్కొండ పాలన కిందకు వచ్చింది. 1684లో ఔరంగజేబు దక్షిణ పథాన్నంతా ఆక్రమించాడు. పరిపాలనా సౌలభ్యం కోసం ఈ ప్రాంతాన్ని విభజించారు. దక్షిణ భారతదేశంలోని మొగలు సామ్రాజ్యాన్ని ఆరు భాగాలుగా విభజించి పరిపాలనను సులభం చేసుకున్నాడు. ఈ ఆరు భాగాల్లో బీజాపూర్ ప్రాంతం చాలా పెద్దది. ఔరంగాబాదు నుంచి మధుర వరకు వుండేది. అందువల్ల బీజాపూర్‌ను మరలా రెండు భాగాలుగా చేసి బీజాపూర్, కర్ణాటక బీజాపూర్‌లుగా విభజించి, కర్నాటక బీజాపూర్‌లో చాలా భాగానికి పాలిగాండ్లను, జాగీరుదార్లనూ ఏర్పాటు చేశారు. ఆర్కాట్ కేంద్రంగా హైద్రాబాద్ విభాగంలోకి ఉదయగిరి సర్వేపల్లిని చేర్చారు. ఆర్కాట్ మొదటి పాలకుడు సాదత్ ఉల్లాఖాన్. ఈతను నవాయితీ వంశస్థుడు.

ఉదయగిరి వ్యవహారాలు చూడటానికి ఫౌజ్‌దారుగా ముస్తఫా ఆలీఖాన్‌ను నియమించారు. ఈ ఆలీఖాన్ తనకు నిర్వహణాది కార్యక్రమాల్లో సహాయం చేయటానికి జూకా తాతను (తండ్రికి తండ్రి) హాఫిజ్ మహమద్ అలీను నియమించి ఉదయగిరికి సంబంధించిన బాధ్యతలను అప్పగించాడు. అప్పుడే వీరు బీజాపూర్ నుంచి సంసారంతో సహా ఆర్కాటుకు వచ్చి, అక్కడి నుంచి నెల్లూరు వచ్చారు. జూకా తండ్రి హాఫీజ్ అహమ్మద్ మీరానాయతీ, పిన తండ్రి పరిపాలనాధికారాన్ని పొందారు. ఉదయగిరి ఆఖరి జాగీరుదారు అబ్బాస్ అలీఖాన్ బ్రిటీషు వారికి ఎదురు తిరిగిన కారణంగా ఖైదీగా బంధించి చెంగల్పట్టులో వుంచారు. అతడు చెంగల్పట్టులో మరణించారు.

హాఫీజ్ అహమ్మద్ మీరా నాయతీకి ఐదుగురు కుమారులు. ఇద్దరు కుమార్తెలు. వీరందరూ నెల్లూరు సంతపేటలోని మహమ్మద్ గౌస్ సత్రం (ప్రస్తుత సంతపేట మార్కెట్) అని పిలవబడుతున్న చోట జన్మించారు. ఇది వీరి మేనమామ ఇల్లు. గౌస్ సాహెబ్ జౌళి వ్యాపారస్తుడు. ఇతనికి బిడ్డలు లేని కారణంగా 'జూకా' పెద్ద అన్నయ్య హాజీ రహంతుల్లాను దత్తు తీసుకున్నారు. (ఈతనే వి.ఆర్. కళాశాల భవన దాత)


జూకా అసలు పేరు మహమ్మద్ హబీబుల్లా. జననం



1828. చిన్నప్పుడు ఇంటివద్ద మౌల్వీ (గురువు) గారి చేత విద్యాబుద్ధులు నేర్చుకున్నారు. తన 12వ ఏటినుండే కవిత్వం రాయటం అలవాటు చేసుకున్నారు. తర్వాత కాలంలో మద్రాసు నగరానికి వెళ్ళారు. అప్పట్లో బకింగ్‌హామ్ కెనాలు ద్వారా మాత్రమే రాకపోకలుండేవి. మద్రాసులో సయ్యద్ ముర్తుజా భీవిష్ అనే అతని వద్ద మూడేళ్లశిష్యరికం చేశారు. ముర్తుజాభీవిష్ పర్షియన్ భాషలో అపారమైన కృషి చేసినవారు.

ఆనాటి మద్రాసు జాగీర్దారు నాలాజాహి వంశానికి చెందిన గులాం గౌస్ ఆజమ్‌కు కూడా కొంత సాహిత్య ప్రవేశం ఉండేది. వీరు 1846 నుంచి ప్రతి వారం 'ముషాయిరా" (కవి సమ్మేళనం) నిర్వహించేవారు. ఈ కవి సమ్మేళనానికి జూకా తన గురువు ముర్తుజాభీవిష్ ఆదేశం మేరకు తన కవిత్వాన్ని పంపారు. జాగీర్దారు అయిన గులాంగౌస్ అజమ్ గారి ద్వితీయ వివాహం సందర్భంగా (ఇనామీ ముషాయిరా) కవి సమ్మేళనంలో అత్యుత్తమ కవిత రాసిన కవికి సన్మానం చేయదలచి మహమ్మద్ హుసేన్ రాఖిమ్ అనే కవి నిర్వహణలో కవి సమ్మేళనం ఏర్పాటు చేశారు. జూకా కవిత ఈ సమ్మేళనంలో చదవబడితే- తప్పకుండా అతనికే సన్మానం జరుగుతుందని, అందువల్ల తన ప్రాముఖ్యత పోతుందని భావించిన రాఖిమ్ ఒక నిబంధన విధించాడు. ఈ సమ్మేళనంలో కవే స్వయంగా చదివి వినిపించాలనేది ఆ నిబంధన. జూకాకు నత్తి కనుక, సమ్మేళనంలో పాల్గొనలేడన్న అతడి పన్నాగం నెరవేరింది. ఈ సంఘటన తరువాత జూకా నెల్లూరు వచ్చేసారు.

తదుపరి విమర్శక కవిత్వం రాశారు. అందులో జాగీర్దారు గులాంగౌస్ ఆజమ్ పేరు మీద రాయబడిన 'గుల్జార్ ఏఆజమ్' అనే గ్రంథం అసలు రచయిత రాఖీమ్ అని ఉదాహరణలతో సహా నిరూపించారు. తర్వాత వివాహం, ఒక అబ్బాయి పుట్టడం జరిగింది. ఈ కాలంలో జూకా గాలిబ్ రాసిన 'పంచ్‌అహంగ్' చదవటం జరిగింది. పంచ్ అనగా ఐదు, అహంగ్ అనగా శబ్దాలు అని అర్థం. ఈ గ్రంథ పఠనం జూకా మెదడును కుదిపివేసింది. తానెంత బావిలో కప్పో తేల్చి చెప్పింది. 'యీ గ్రంథం చదవకముందు నేను సాహిత్యంలో చాలా కషి చేసానని అనుకునేవాణ్ణి, కానీ 'పంచ్‌అహంగ్' చదివిన తర్వాత నేను రచించిన రచనల్లో ఏమీ పస లేదని తేల్చుకున్నాను' అని ఆయన రాసుకున్నాడు కూడా! తరువాత గాలిబ్ వద్ద శిష్యరికం చేయాలనే ఏకైక ధ్యేయంతో ఢిల్లీకి ప్రయాణమచ్చాడు. అయితే, డబ్బు లేమి హైద్రాబాదులో ఆపేసింది. తిరిగి ధనం సంపాదించి ఢిల్లీ పోవాలనే తపనతో సోలార్‌జంగ్ వద్ద పర్షియన్ లేఖకుడిగా ఉద్యోగంలో చేరాడు. హైదరాబాదులో తను చేసిన రచనలు ఉత్తరాల ద్వారా గాలిబ్‌కు పంపి ప్రత్యుత్తరాలు పొందేవాడు. ఈ విశ్వంలో ఉండే కష్టాలు, మానవ జీవితం, భూమిపై జీవనం, ఈ మూడే ఈతని కవిత్వ ప్రేరణలు. గజల్ రచనల్లో నిష్ణాతులైన కవులు మీర్‌తఖీమీర్, మీర్ గాలిబ్ తమ రచనల్లో అనేకానేక భావాలను చొప్పించేవారు. కానీ, జూకా మాత్రం అతీంద్రియ భావాల తాలూకు నీడలు కూడా తన రచనలపై పడనీయలేదు. గజల్ రచయితల్లో ప్రత్యేక పంథా అనుసరించాడు. అతడి కషి తనకూ, తన గురువు గాలిబ్‌కు మధ్య అజ్ఞాతంగానే ఉండిపోయింది. అయితే 'తలామీజాఏ గాలిబ్' (గాలిబ్ శిష్యులు) అను అంశంపై పరిశోధన చేసిన ఢిల్లీవాసి మాలిక్‌రాం ... జూకా గురించి ప్రస్తావించారు.



ఉర్దూఏఅల్లా, ఊద్ఏహిందీ అనే రెండు గ్రంథాల్లో గాలిబ్ తాను ఇతరులకు రాసిన ఉత్తరాలు ఉన్నాయి. వీటిని మాలిక్‌రాం పరిశోధించి, జూకాకు గాలిబ్ మహాకవి రాసిన దాదాపు 20 ఉత్తరాల్లోని సారాంశాన్ని గ్రహించి, హైద్రాబాద్ వచ్చారు. ఇక్కడ జూకా బంధువులను అతి కష్టం మీద కలిసి ముద్రణకు నోచుకోని జూకా చేతి వ్రాత ప్రతులన్నింటినీ కొనుగోలు చేసి తీసుకుని వెళ్లాడు. వీటి ద్వారా జూకాను వెలుగులోకి తెచ్చిన మొదటి వ్యక్తి స్కాలర్ మాలిక్ రాం.

జూకా మరణానంతరం జూకా కుమారుడు మహమ్మద్ మీరా 'ఖాష్‌ఓఖుమాష్' (చెదురు మదురు లేఖలు)అనే గ్రంథాన్ని అచ్చు వేయించాడు. జూకా తానే సొంతంగా సంకలనం చేసి ఆ ప్రతిని గాలిబ్ మహాకవికి పంపి దానికి ముందుమాట రాయించి, తెప్పించి తన వద్దనే ఉంచుకొన్నాడు. ఇది దాదాపు 80 పేజీల చేతి రాత పుస్తకం. ఇందులో మానవ శృంగారాన్ని గజల్‌లో రాశారు. ఇది అంగాంగ వర్ణనా కవిత్వం కాదు. శాస్త్రీయ శృంగారం, మానవులకు అవసరం అనే దృష్టితో రాసిన గ్రంథం. ఈ రచనకు జూకా ఇంకో కలం పేరు ఉపయోగించారు. ఆ పేరు షేక్ అలీబేబాక్ అని. ఈ రాతప్రతి ప్రస్తుతం హసన్ ఉద్దీన్ అహ్మద్, ఐఏఎస్ (రిటైర్డ్) మదీనా కాంప్లెక్స్ హైద్రాబాదు వారి పుస్తక భాండాగారంలో ఉంది.

సమకాలీన సమస్యల ప్రతిస్పందనకు ఈ గజల్ ఒక ఉదాహరణ. అప్పటికే భారతదేశంలో ఇంగ్లీషు పరిపాలన వచ్చేసింది. బ్రిటీషు సంస్కృతి ఎల్లడలా విస్తరిస్తోంది. దీన్ని చూచి ఈ కవి అంటాడు : "నేను పరిమళాన్ని గ్రోలే పిట్టను ప్రతి పువ్వు వద్ద నేనుంటాను. కానీ పువ్వు పరిమళాన్ని వెదజల్లుతున్నదన్న భ్రమలో ఉన్న మీరు అది పరిమళమో, పిడుగు ప్రభంజనమో తెలుసుకోలేకున్నారు. ఎందుకంటే పువ్వు పరిమళాన్ని ఆస్వాదించే నాకు పరిమళమే కాకుండా ఉన్న గూడు కూడా లేకుండా పోయింది." ఎంతటి భావాన్నయినా చెప్పగలిగిన ఈ రెండు పాదాలు ఎంత చిన్నవో చూడండి.

"మోజే గుల్ భీహై కోయీ బర్ ఖే
భలా అయినన్ బహార్
యాతో గుల్ బాంధా థాయా ఆజ్
ఆషియా మిల్ తా నహీ"
మచ్చుకు మరో తునక తనెంత ధైర్యవంతుడో చెప్తుంది.
"హిమ్మత్‌కి బులంధీ కొ కోయీ
ఓజ్ న నహుండే
హై నబ్జాఏ ఖానిదా ఫలక్ మేరే
ధమన్ కా"

" ధైర్యం ఎత్తులు కొలిచే ధైర్యవంతుడెవడూ లేరు. కానీ నా ధైర్యం ముందు ఆకాశం ఎండకు వంగిన మొక్కలాంటిది." మూర్ఖ మతస్థులకు తన గజల్ చర్నాకోలుతో ఓ చురక.

ఈ కవి తన జీవిత కాలంలో గాలిబ్‌ను కలవ లేదు. తన 47వ ఏట (1857) హైద్రాబాదులో చనిపోయాడు. వందేళ్లకు అజ్ఞాతంగా ఉన్న మహమ్మద్ హబీబుల్లా జూకా దక్షిణ భారతదేశపు తొలి గజల్ కవి. నెల్లూరు వి.ఆర్.కాలేజీ ఉర్దూ లెక్చరర్ డా. షేక్ అబ్దుల్ వహాబ్ .... జూకా కవిత్వం వ్యక్తిత్వంపై పరిశోధనను ఉర్దూలోనే చేసి 1986లో డాక్టరేట్ పొందారు. జూకా గురించి విపులంగా చర్చించిన తొలి పరిశోధక గ్రంథం ఇదే!

- ఈతకోట సుబ్బారావు
94405 29785

పోరుకేక

కలలు వికసించే స్వేచ్ఛా తీరాల్లో
గోదావరి నదీ పరీవాహక ప్రాంతంలో
ముంపులో కొట్టుకుపోతున్న పోలవరం నిర్వాసితుల కథ
భూమి కోసం, అటవీ హక్కుల కోసం పోరాడుతున్న అడవిబిడ్డల గాథ
గిరిజనులు...
చెల్లాచెదురుగా ఉన్న ఆత్మలు, మనుగడ కోసం ఆరాటపడుతున్న బతుకులు
వారి హృదయాలు గోదావరితోనూ, అడవితోనూ పెనవేసుకున్న జ్ఞాపకాలు
కట్టెలు, తేనె, వెదురు, అడవి కూరగాయలు, పుట్టగొడుగులతో
అమ్మలా ఆదుకుని బువ్వెట్టిన అడవి తల్లికి దూరమై..
ఆత్మలేని మనుషుల్లా... సమీప పొలాల్లోకి నెట్టబడిన వ్యవసాయ కూలీలు వీరు

పోలవరం, వారి సిరల్లో ప్రతిధ్వనించే పేరు
అడవీ, వారి నరనరాన జీర్ణించుకున్న ఊరు
మూలాలు, వారసత్వం, ప్రేమ ఇక్కడ మిగిలిపోయింది
వసతుల్లేని లోతట్టు కాలనీల్లోకి నెట్టినా...
న్యాయంగా రావాల్సిన పరిహారం కోసం
అక్కడే మిగిలిపోయిన దశాబ్దాల నాటి హక్కుల కోసం
వారి ఆత్మల కోసం ఇంకా పోరాడుతూనే వున్నారు !

గోదావరి పరవళ్లను, అడవితల్లి వ్యథలను చిన్ననాటి కథలను
గుర్తు చేసుకుంటూ పిడికిలి బిగించు... గొంతెత్తి గర్జించు...
గలగలపారే ప్రశాంత గోదావరిలా కాదు
ఉవ్వెత్తున ఎగసిపడే వరదగోదావరిలా మారు...
నిర్వాసిత నేస్తల్లారా ...

ఎర్రజెండా అండగా కదిలింది పోరుయాత్ర
ఒక్క అడుగుతో మొదలై వేలాదిగా విస్తరిస్తూ సాగింది పాదయాత్ర
వేల అడుగులు ఒక్క దిశగా సాగుతున్న పోలవరం మహాయాత్ర
హక్కుల కోసం జగన్నాథ రథచక్రాలై కదిలింది పోరుయాత్ర !

నువు కలలుగన్న భూమి కోసం, హక్కుల కోసం
నువు కట్టుకున్న జ్ఞాపకాల పొదరింటి కోసం, అల్లుకున్న అనుబంధాల కోసం
నీకోసం కదిలింది పోరుకేక... పోలవరం ఆలింగనం కోసం
ఈ పోరాటం నీకోసం నాకోసం... రేపటి మన బిడ్డల కోసం
కదిలిరా సోదరా... దండుకట్టి సాగుదాం...
పోలవరం నిర్వాసితులకు అండగా నిలుద్దాం...
అరుణారుణ తొలిపొద్దులో ఎర్రమందారాలై వెలుగుదాం!

- రాజాబాబు కంచర్ల

చిన్నారుల బొమ్మల్లో వేమన పద్యం

దాదాపు నాలుగు వందల సంవత్సరాల క్రితం జీవించిన ప్రజాకవి వేమన - అప్పటి సమాజాన్ని ఎంత దగ్గరగా చూశాడో, ఎంత కచ్చితంగా తన భావాలను వెల్లడించాడో ... ఆయన పద్యాలను చదివితే అర్థమవుతుంది. ఆయన కలం స్వార్థపర, విచ్ఛిన్న శక్తులను గడగడలాడించింది. దురాచారాలను, దుర్మార్గాలను చీల్చి చెండాడింది. అది కుల అహంకారమైనా, డబ్బు, అధికార మదమైనా, మత అంధత్వమైనా, మూఢవిశ్వాసమైనా, పాచి పట్టిన ఆచారమైనా, మనిషి మనసులోని కుళ్లయినా, కళ్లలోని పిరికితనమైనా ఏదైనా సరే ... దేన్నీ వదిలిపెట్టలేదు వేమన. అన్ని జాఢ్యాలను వేలెత్తి చూపాడు. విమర్శించాడు. దురాగతాల, దుర్మార్గాల వెనుక ఉన్న దోపిడీ మర్మాన్ని సామాన్యునికి అత్యంత సులభ శైలిలో విప్పి చూపించాడు. తిరగబడమని పిలుపునిచ్చాడు. ఆయన ఆటవెలదిలో అల్లిన అనేక పద్యాలు ఇప్పటి పరిస్థితులకు కూడా అతికినట్టు సరిపోతాయి.

నేడు మత విద్వేషాలను రెచ్చగొట్టే భావజాలాన్ని స్వయానా పాలకులే పథకం ప్రకారం పారిస్తున్నారు. కులాల ఆధిపత్యాలూ, విబేధాలూ జడలు విప్పుతున్నాయి. అణగారిన బతుకులు మరింతగా అణచివేయబడుతున్నాయి. అనేక దురాచారాలు, అంధ విశ్వాసాలు పెద్ద ఎత్తున ప్రాచుర్యం పొందుతున్నాయి. మన అన్నది ఏదీ లేక నీదీ నాది అనే భావన వేళ్లూనుకుంటోంది. దేశభక్తి వంటి భావనలను సంకుచిత, స్వార్థపూరిత అర్థాలకు పరిమితం చేస్తున్నారు. దేవుణ్ని అడ్డం పెట్టుకొని ప్రజల మధ్య చిచ్చు పెట్టి వారి పొట్ట గొడుతున్నారు. ఇది తప్పు అని ఎవరైనా వేలెత్తి చూపిస్తే సహించలేని స్వార్థపర శక్తులు పెచ్చు పెరిగాయి. ఈ పరిస్థితుల్లో వేమన పద్యం మన సమాజానికి చాలా అవసరం. నేటి సమాజంపై జరుగుతున్న విష సాంస్కృతిక దాడికి సమాధానం చెప్పే పదునైన బల్లెం వేమన పద్యం. అందుకే అతడి భావాల వెలుగులను నేటి తరానికి మరింత సులభతరంగా పంచాలని తాపత్రయపడింది విజయవాడలోని 'జాషువా సాంస్కృతిక వేదిక'. ముఖ్యంగా చిన్నారుల మనసులకు హత్తుకునేలా



వేమన భావాలను వ్యాప్తి చేయాలని తలచింది.

అనుకున్నదే తడవుగా ఆ ఆలోచనను వినూత్నంగా అమలు చేసింది. ఆ బాధ్యతను చిన్నారులకే అప్పగించింది. వేమన పద్యాలకు బొమ్మలు గీచే పోటీని నిర్వహించింది. దీనికి రాష్ట్రం నలుమూలల నుంచి 110 చిత్రాలు వచ్చాయి. అందులో మెరుగైన వాటిని ఎంపిక చేసి పుస్తకంగా కూర్చింది. ఈ పుస్తకం ప్రత్యేకత అదే! వేమన పద్యాలను అవగాహన చేసుకొని చిన్నారులు వాటికి అందమైన బొమ్మలు గీశారు. పద్యానికి రంగులు అద్ది, జీవం పోశారు. వీటి నుంచి ఎంపిక చేసిన బొమ్మలతో 60 పేజీల అందమైన వేమన పద్యాల బొమ్మల పుస్తకాన్ని జాషువా సాంస్కృతిక వేదిక ప్రచురించింది. 'వేమన పద్య ప్రగతికి పట్టం... కనదగునెవ్వరు గీసినా ...' అనే శీర్షికన వెలువడిన ఈ పుస్తకం. అపురూపమైనది. అందరి చేతిలో ఉండదగినది.

'ప్రజాకవి వేమన' అంటూ యు.వి. రామరాజు ముందుమాట రాశారు. ఓ పదునైన వేమన పద్యాన్ని ప్రస్తావిస్తూ ఆ ముందుమాట మొదలవుతుంది. "కులము గలవారు గోత్రంబు గలవారు/ విద్యచేత విర్రవీగువారు/ పసిడి కలుగువాని బానిస కొడుకులు/ విశ్వదాభిరామ వినురవేమ.." వేమన ఎంత నిర్భయంగా, నిర్మొహమాటంగా తన భావాలను వెల్లడించాడో చెప్పటానికి ఈ ఒక్క పద్యం చాలు. ఇది చదివితే ... నేడు దేశంలోని రాజకీయాలు,ప్రభుత్వాలు, పాలకులు కార్పొరేట్లకు దాసోహం అంటున్న పరిస్థితి కళ్లకు కడుతుంది. ఈ పుస్తకంలోని దాదాపు 60 పద్యాలను పిల్లల బొమ్మల్లోంచి, వాళ్ల ఆలోచనల్లోంచి మనం తిలకించవొచ్చు. చాలా నాణ్యమైన కార్డుబోర్డు పేపరు మీద రంగుల్లో చాలా అందంగా వెలువరించిన ఈ పుస్తకం పిల్లల అందరి చేతిలోకి వెళ్లాలనేది ప్రచురణ కర్తల ఆలోచన. అందుకే రూ.25ల ధరనే నిర్ణయించారు. ప్రతులకు 99515 40671 నెంబర్లో సంప్రదించవచ్చు. ఈ పుస్తక ప్రచురణకు ఆలోచన-ఆచరణ ఎ.సునీల్ కుమార్, వొరప్రసాద్, అనిల్ డ్యానీ. అభినందనీయమైన కృషి చేశారు. చిత్రకారుల పేరును బొమ్మ దిగువన విడిగా ఇస్తే బాగుండేది. అలాగే 'ఎలుక తోలు తెచ్చి ఎందాక ఉతికిన గానీ నలుపు నలుపే కానీ తెలుపు రాదు..' వంటి భావాలతో కూడిన పద్యాలను పరిహరిస్తే బాగుండేదని అనిపించింది. జాషువా సాంస్కృతిక వేదిక ఇటీవల అనేక ప్రయోజనకర కార్యక్రమాలు నిర్వహిస్తోంది. ఇలాంటి ప్రయత్నాలు, ప్రచురణలు మరిన్ని జరగాలని మనసారా ఆశిద్దాం.

- ఎల్.శాంతి
76800 86787

కలిమిశ్రీకి కుసుమ ధర్మన్న సాహిత్య సేవా పురస్కారం

'మాకొద్దీ నల్లదొరతనం' అంటూ నినదించిన కవి కుసుమ ధర్మన్న పేరిట ఏర్పాటు చేసిన సాహిత్యసేవా పురస్కారాన్ని నవ మల్లెతీగ సంపాదకులు కలిమిశ్రీకి ప్రకటించారు. కలిమిశ్రీ గత 16 సంవత్సరాలుగా నవమల్లెతీగ మాసపత్రికను నిరాటంకంగా నడుపుతూ కొత్తతరం సాహితీవేత్తలను ప్రోత్సహించడంలో ముందడుగు వేస్తున్నారు. జులై 16న విజయవాడలో కుసుమ ధర్మన్న సాహితీ కళాపీఠం నిర్వహించే ప్రత్యేక సాహిత్య కార్యక్రమంలో కలిమిశ్రీ గారికి సాహితీసేవా పురస్కారాన్ని అందజేస్తాము. ఈ అవార్డుకు రూ.11,116 ల నగదుతో జ్ఞాపిక, శాలువాతో సత్కారం వుంటుంది.

- డా.రాధా కుసుమ, కుసుమ ధర్మన్న సాహితీ కళాపీఠం

చిన నాగయ్య స్మారక పురస్కారం-2023

ప్రముఖ స్వాతంత్ర్య సమర యోధుడు ఎం.చిన నాగయ్య స్మారక పురస్కారానికిగాను ఉత్తమ కవితా సంపుటి, ఉత్తమ కథా సంపుటి, ఉత్తమ వ్యాస సంపుటి, ఉత్తమ జీవిత చరిత్ర విభాగాల్లో రచయితల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు నాగయ్య మెమోరియల్ ట్రస్ట్ ప్రతినిధి ఎం.రాంప్రదీప్ ఒక ప్రకటనలో తెలిపారు. రచయితలు రెండు ప్రతులను ఆగస్టు 31లోగా పంపాలని కోరారు. చిరునామా : ఎం.రాం ప్రదీప్, 10-263-6, ఆర్చ్ రోడ్డు, సాయి రాఘవ కాలనీ, తిరువూరు, ఎన్టీఆర్ జిల్లా, ఆంధ్రప్రదేశ్, పిన్ 521235. ఫోన్ : 9492712836.

డాక్టర్ వి.చంద్రశేఖర రావు నవలల ఆవిష్కరణ

జూలై 8, 2023 శనివారం సాయంత్రం 6 గంటలకు విజయవాడ ప్రజాశక్తి నగర్‌లోని శిఖర స్కూలులో డాక్టర్ వి.చంద్రశేఖర రావు ఆకుపచ్చని దేశం, నల్లమిరియం చెట్టు నవలలను పాపినేని శివశంకర్ ఆవిష్కరిస్తారు. పెనుగొండ లక్ష్మీ నారాయణ అధ్యక్షత వహించే ఈ సభలో వాడ్రేవు వీరలక్ష్మీదేవి, ముంజులూరి కృష్ణకుమారి, బండ్ల మాధవరావు, వి.ప్రసూన, కాట్రగడ్డ దయానంద్ పాల్గొంటారు .

- డాక్టర్ వి.ప్రసూన,
డాక్టర్ వి.చంద్రశేఖర రావు సాహిత్య కుటుంబం తరపున

శ్రీనివాస్ గౌడ్‌కి నరేంద్రబాబు సాహిత్య పురస్కారం

ప్రతిష్టాత్మక కొత్తపల్లి నరేంద్రబాబు సాహిత్య పురస్కారం 2022కు గాను పి శ్రీనివాస్ గౌడ్ రచించిన చిన్ని చిన్ని సంగతులు సంపుటి ఎంపికైనట్టు అవార్డు నిర్వాహకులు శ్రీ కొత్తపల్లి సురేష్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రకాశం జిల్లా చీరాలకు చెందిన పి.శ్రీనివాస్ గౌడ్ ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు ఉపాధ్యాయులుగా పని చేసి, ప్రస్తుతం నిర్మాణ రంగంలో వున్నారు. కవిత్వం, కథ, విమర్శ, అనువాదాలలో కృషి చేస్తున్నారు. ఇప్పటివరకు 9 కవిత్వ పుస్తకాలు వెలువరించారు. కవిత్వానికి, కథలకు పలు పురస్కారాలు అందుకున్నారు. విడి ఆకాశం, రెక్కల పతాక, కథాపురి, కథాప్రకాశం సంకలనాలకు సంపాదక బాధ్యతలు నిర్వహించారు. త్వరలో అనంతపురంలో అవార్డు ప్రదానోత్సవ సభ ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.

ఉమ్మడి పౌర స్మృతి.. ఎవరిదారి ఎటు?

- కాంగ్రెస్‌లో భిన్నాభిప్రాయాలు
- యుసిసికి బిఎస్‌పి, ఆప్ మద్దతు
- ఎన్‌డిఎ భాగస్వామి ఎన్‌పిపి వ్యతిరేకం

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఓటు బ్యాంకు రాజకీయాల్లో భాగంగా మోడీ సర్కార్ తీసుకొచ్చే ఉమ్మడి పౌర స్మృతిపై దేశంలోని రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చ జరుగుతోంది. ఒక పార్టీకి చెందిన నాయకులే వేర్వేరు అభిప్రాయాలను వ్యక్తం చేస్తున్నారు. అదే విధంగా మిత్రపక్షాలుగా ఉన్న పార్టీలు కూడా భిన్న వాదనలను వినిపిస్తున్నాయి. యూనిఫాం సివిల్ కోడ్ (యుసిసి) కొన్ని పార్టీలు మద్దతిస్తే, మరికొన్ని పార్టీలు వ్యతిరేకిస్తున్నాయి. మేఘాలయలో ఎన్‌డిఎ భాగస్వామ్య పక్షం నేషనల్ పీపుల్స్ పార్టీ (ఎన్‌పిపి) తీవ్రంగా వ్యతిరేకిస్తుంది. మేఘాలయ ముఖ్యమంత్రి, ఎన్‌పిపి అధ్యక్షుడు కాన్రాడ్ కె.సంగ్మా భారత వాస్తవ ఆలోచనకు యుసిసి విరుద్ధమని అన్నారు. యుసిసిని సమాజ్‌వాదీ పార్టీ వ్యతిరేకించింది. ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి శివపాల్ యాదవ్ మాట్లాడుతూ యుసిసిపై బిజెపి ఉద్దేశంగా ప్రచారం చేస్తుందని, వచ్చే ఎన్నికల్లో ఓట్లను కొల్లగొట్టడం కోసం ప్రయత్నిస్తోందని దుయ్యబట్టారు. యుసిసిని కాంగ్రెస్, డిఎంకె, జెడియు, నేషనల్ కాన్ఫరెన్స్, ఆర్‌జెడి, సిపిఎం, సిపిఐ, టిఎంసి, ఐయుఎంఎల్ వంటి పార్టీలు వ్యతిరేకిస్తున్నాయి. శివసేన (ఉద్ధవ్ ఠాక్రే), ఆమ్ ఆద్మీ పార్టీలు దీనికి మద్దతిస్తున్నాయి. ఉత్తరప్రదేశ్‌లో సమాజ్‌వాదీ పార్టీ (ఎస్‌పి) మిత్ర పక్షమైన సుహేల్‌దేవ్ భారతీయ సమాజ్ పార్టీ (ఎస్‌బిఎస్‌పి) ఉమ్మడి పౌర స్మృతికి మద్దతు ప్రకటించింది. దేశంలో అందరికీ ఒకే చట్టం ఉండాలని స్పష్టం చేసింది. ఎస్‌బిఎస్‌పి చీఫ్, ఎమ్మెల్యే ఓం ప్రకాశ్ రాజ్‌భర్ మాట్లాడుతూ, కేంద్రం యుసిసిని తీసుకురావడానికి ప్రయత్నిస్తోందని, మద్దతిస్తానని చెప్పారు. అందరికీ ఒకే చట్టం ఉండాలని అన్నారు. దేశ ప్రయోజనాలకు అనుగుణంగా ఉన్నదానికి తాను మద్దతిస్తానని చెప్పారు. అలాగే యుసిసికి బహుజన్ సమాజ్ పార్టీ (బిఎస్‌పి) అధ్యక్షురాలు మాయావతి మద్దతు తెలిపారు. భారతీయులందరినీ యుసిసి కలిపి ఉంచుతుందని అన్నారు. యుసిసి అమలు వల్ల దేశానికి బలం చేకూరుతుందని, ప్రజల్లో సోదర భావాన్ని పెంపొందిస్తుందని చెప్పారు. అయితే, మోడీ ప్రభుత్వం బలవంతంగా ఈ సంస్కరణలు చేపట్టేందుకు జరుపుతున్న ప్రయత్నాన్ని ఆమె తప్పుపట్టారు. 'యుసిసిని అమలుకు మా పార్టీ వ్యతిరేకం కాదు. అయితే యుసిసి అమలు చేయడం కోసం బిజెపి అనుసరిస్తున్న వైఖరికి మేము మద్దతివ్వం. ఈ అంశాన్ని రాజకీయం చేసి, బలవంతంగా దేశంలో యుసిసి అమలు చేయాలని బిజెపి కోరుకుంటుంది' అని మాయావతి విమర్శించారు.

కాంగ్రెస్‌లో భిన్నాభిప్రాయం

యుసిసిని కాంగ్రెస్ వ్యతిరేకిస్తున్నట్లు కనిపిస్తున్నా.. దీనిపై పార్టీ నాయకులు భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. హిమాచల్ ప్రదేశ్ పిడబ్ల్యుడి శాఖ మంత్రి, రాష్ట్ర కాంగ్రెస్ చీఫ్ ప్రతిభ సింగ్, మాజీ ముఖ్యమంత్రి వీరభద్ర సింగ్ తనయుడు, కాంగ్రెస్ నేత విక్రమాదిత్య సింగ్ యుసిసిని సమర్థిస్తూ మాట్లాడారు. యుసిసిని కాంగ్రెస్ సమర్థిస్తుందన్నారు. ఐకమత్యం, సమగ్రతను మరింత ప్రోత్సాహించేందుకు తమ పార్టీ ఎల్లప్పుడూ కృషి చేస్తోందన్నారు. అయితే ప్రజలను తప్పుదోవపట్టించడానికే దీనిపై బిజెపి చర్చను ప్రారంభించిందని ఆరోపించారు. దాదాపు రెండు నెలల నుంచి మణిపూర్ తగులబడుతోందని, అంతర్యుద్ధం వచ్చే పరిస్థితి కనిపిస్తోందని, అయినాకానీ ఆ రాష్ట్ర ముఖ్యమంత్రిపై ఇప్పటికీ బిజెపి ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదని దుయ్యబట్టారు. దేశంలో వాస్తవ సమస్య గురించి బిజెపి నోరు మెదపడన్నారు. విక్రమాదిత్య వ్యాఖ్యలపై కాంగ్రెస్ ఎంపి, సీనియర్ నేత ప్రమోద్ తివారీ స్పందిస్తూ, తమ పార్టీ వ్యూహ నిర్ణయ సమావేశంలో తీసుకునే నిర్ణయమే అంతిమమని, దీనికి భిన్నంగా ఎటువంటి అభిప్రాయానికి ప్రాధాన్యం లేదని చెప్పారు. యుసిసిపై వ్యూహాన్ని నిర్ణయించేందుకు ఓ సమావేశాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. యుసిసి ముసాయిదా వచ్చిన తర్వాత తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తామన్నారు.

సిపిఎం స్పష్టమైన వైఖరి

దేశంలోకి ఏకరూప సివిల్ కోడ్ తీసుకురావాలని కేంద్ర ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాన్ని తమ పార్టీ అన్ని విధాలా వ్యతిరేకిస్తుందని సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి స్పష్టం చేశారు. 'యుసిసి సమాజంలో సమానత్వాన్ని సాధించే లక్ష్యాలను చేరుకోదు. యుసిసి వస్తే భిన్న మతాలు, కులాలకు చెందిన మహిళలు పక్షపాతానికి గురవుతారు. 2017లో చివరి రౌండ్ సంప్రదింపుల నుండి యుసిసిని వ్యతిరేకించింది, ఇది రాజకీయంగా ప్రేరేపితం" అని అన్నారు. సిపిఐ ప్రధాన కార్యదర్శి డి రాజా మాట్లాడుతూ యుసిసి ఒక నిర్దిష్ట వర్గాన్ని లక్ష్యంగా చేసుకుంటుందని, ఈ కసరత్తుకు పార్లమెంటు నాయకత్వం వహించాలని, లా ప్యానెల్ కాదని అన్నారు. 'యుసిసిపై ఏకాభిప్రాయం లేదు. ఇది ఒక నిర్దిష్ట సమాజాన్ని లక్ష్యంగా చేసుకున్నట్లు భావించబడింది. మేము లింగ సమానత్వం, లింగ సాధికారత, మహిళా హక్కులను ప్రచారం చేస్తాము. ఎందుకు లా కమిషన్ ఈ కసరత్తు చేస్తోంది. పార్లమెంటు ఉంది. మన ప్రజాస్వామ్యంలో పార్లమెంటు అత్యున్నతమైనది. ఏది చర్చించాలన్నా అక్కడ చర్చించాలి' అని అన్నారు. మరోవైపు పార్లమెంటు వర్షాకాల సమావేశాల్లో యుసిసి బిల్లును ప్రవేశపెట్టే అవకాశం ఉన్నట్లు రాజకీయ పార్టీల్లో చర్చ జరుగుతోంది.

అవకాశవాదానికి కేరాఫ్ అజిత్



ముంబయి : ఎన్‌సిపిని చీల్చి, ఎన్డీయే పంచన చేరిన అజిత్ పవార్ అవకాశవాద రాజకీయాలకు కేరాఫ్‌గా నిలిచారు. షిండే నేతృత్వంలోని శివసేన, బిజెపి ప్రభుత్వంలో ఉపముఖ్యమంత్రి పదవిని తాజాగా చేపట్టిన ఈ 63 ఏళ్ల నాయకుడు ఇంతకుముందు కూడా ఇలానే పార్టీలో చీలిక తీసుకొచ్చారు.. అప్పుడు కూడా ఇలానే బిజెపి ప్రభుత్వంలో డిప్యూటీ సిఎంగా చేరారు. ఆ తర్వాత మద్దతు ఉపసంహరించుకుని తిరిగి సొంతం పార్టీకి వచ్చారు.

అజిత్ నేపథ్యం

అజిత్ తండ్రి అనంతరావు పవార్. ఈయన ప్రముఖ సినీ దర్శకుడు శాంతారారం వద్ద పని చేశారు. అయినా.. అజిత్ సినిమాల వైపు మళ్లలేదు. రాజకీయాల్లో ఉన్న బాబాయ్ శరద్ పవార్ మార్గాన్ని అనుసరించి సొంత పట్టణమైన బారామతి నుంచి తొలిసారిగా 1991లో లోక్‌సభకు ఎన్నికయ్యారు. ఆ సమయంలో ఏర్పడిన పివి నరసింహారావు ప్రభుత్వంలో.. శరద్ పవార్ రక్షణ మంత్రిగా బాధ్యతలు చేపట్టడం వల్ల అజిత్ మహారాష్ట్రలో పార్టీ వ్యవహారాలను చూసేవారు. లోక్‌సభ స్థానానికి రాజీనామా చేసి.. బారామతి అసెంబ్లీ స్థానం నుంచి శాసనసభకు ఎన్నికయ్యారు. వెంటనే అప్పటి ముఖ్యమంత్రి సుధాకర్‌రావు నాయక్ ప్రభుత్వంలో సహాయ మంత్రిగా నియమితులయ్యారు. ఆ తర్వాత వరుసగా ఆరు సార్లు బారామతి స్థానానికి ప్రాతినిధ్యం వహించారు.

శరద్ పవార్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు.. సహాయ మంత్రిగా పలు విభాగాల బాధ్యతలు చూశారు. 1999లో శరద్ పవార్ కాంగ్రెస్‌ను వీడి ఎన్‌సిపి స్థాపించినప్పుడు ఆయన వెంటే ఉన్నారు. అదే ఏడాది మహారాష్ట్రలో హంగ్ అసెంబ్లీ ఏర్పడినప్పుడు కాంగ్రెస్-ఎన్‌సిపి పొత్తు పెట్టుకున్నాయి. విలాస్‌రావు దేశ్‌ముఖ్ ముఖ్యమంత్రి కాగా, అజిత్ కీలకమైన నీటిపారుదల శాఖ మంత్రిగా పనిచేశారు. అశోక్ చవాన్, సుశీల్ కుమార్ షిండే హయాంలోనూ అజిత్ మంత్రిగా పని చేశారు. ఆ తర్వాత పథ్వీరాజ్ చవాన్ మంత్రివర్గంలో ఉపముఖ్యమంత్రి పదవిని చేపట్టారు. నీటిపారుదల శాఖను నిర్వహించినప్పుడు ఆయనపై పలు అవినీతి ఆరోపణలు రావడం వల్ల ఉప ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేసి, ఆ తర్వాత ఉపసంహరించుకున్నారు.

పదేపదే అలకలు..

శరద్ పవార్‌కు మగపిల్లలు లేరు. ఏకైక కుమార్తె సుప్రియా సూలే వివాహం చేసుకొని సింగపూర్‌లో స్థిరపడ్డారు. ఆ తర్వాత ఆమె ఎంపీ గెలిచినా..ఢిల్లీకే పరిమితమయ్యారు. ఆమె రాష్ట్ర రాజకీయాల్లోకి రారని శరద్ పవార్ పలు సందర్భాల్లో చెప్పారు. దాంతో శరద్ రాజకీయ వారసుడు అజిత్ అని అందరూ భావించారు. అయితే, 2019లో జరిగిన మహారాష్ట్ర ఎన్నికలకు ముందు రాజకీయాల నుంచి తప్పుకొంటున్నట్టు అజిత్ సంచలన ప్రకటన చేశారు. శరద్ పవార్‌పై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) కేసులు నమోదు చేయడాన్ని ఆయన ఇందుకు కారణంగా పేర్కొన్నారు. 2019లో ఇలాగే ఎన్‌సిపి అధినేతపై తిరుగుబాటు ప్రకటించి..ఎన్నికల తర్వాత దేవేంద్ర ఫడ్నవీస్ నేతత్వంలోని బిజెపి ప్రభుత్వానికి మద్దతు పలికారు. రాష్ట్ర ఉపముఖ్యమంత్రిగా ప్రమాణం చేశారు. అయితే 4 రోజుల్లోనే ఆ పదవికి రాజీనామా చేసి.. మద్దతు ఉపసంహరించుకున్నారు. సొంత పార్టీ ఎన్‌సిపికి తిరిగొచ్చిన అజిత్ పవార్.. ఇలా చేయడం తిరుగుబాటు కాదని అప్పట్లో సమర్థించుకున్నారు. శరద్ కుమార్తె సుప్రియా సూలే పార్టీలో చురుగ్గా వ్యవహరిస్తుండడం అజిత్ ఇబ్బందిగా మారిందని.. తనకు, తన కుమారుడు పార్థ్‌కు పార్టీలో సముచిత స్థానం ఉండదేమోనన్న ఉద్దేశంతోనే అజిత్ బిజెపి పంచన చేరారన్న విశ్లేషణలు వచ్చాయి. మెజారిటీ లేనందువల్ల 2019లో నాలుగు రోజులకే బిజెపి ప్రభుత్వం కూలిపోయిన తర్వాత..కాంగ్రెస్ ఎన్‌సిపి-శివసేన పార్టీల కూటమి 'మహా వికాస్ అఘాడీ' అధికారం చేపట్టింది. ఈ ప్రభుత్వంలో కూడా అజిత్ డిప్యూటీ సీఎంగా పని చేశారు. ఈ ఏడాది ఏప్రిల్‌లోనూ అజిత్ పవార్ ఎన్‌సిపి వీడుతున్నట్లు.. 40 ఎమ్మెల్యేలతో సంతకాలు సేకరించారని ఊహాగానాలు వినిపించాయి. వీటిని ఖండించిన పవార్.. తాను ఎన్‌సిపిలోనే ఉంటానని స్పష్టం చేశారు. ఆ తర్వాత కొన్నిరోజులకు శరద్ పవార్ పార్టీ అధ్యక్ష స్థానానికి రాజీనామా ప్రకటించగా.. ఎన్‌సిపి అధ్యక్ష పీఠం ఎవరిని వరిస్తుందని చర్చ జరిగింది. కానీ తర్వాత శరద్ పవార్ తన రాజీనామాను ఉపసంహరించుకున్నారు. ఇటీవల పాట్నాలో జరిగిన ప్రతిపక్షాల భేటీలో శరద్‌పవార్, సుప్రీయా సూలే పాల్గొనడం, పార్టీలో సుప్రీయా క్రియాశీలకంగా ఉన్నారన్న అసంతృప్తితోనే మళ్లీ ఇప్పుడు అజిత్ మరోమారు బిజెపి పంచన చేరారని రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నారు.

ఘాటెక్కుతున్న సుగంధ ద్రవ్యాలు

లక్నో : వంట ఇంటిలో ఉపయోగించే సుగంధ ద్రవ్యాల ధరలు అకస్మాత్తుగా పెరగడంతో మధ్యతరగతి ప్రజల బడ్జెట్‌పై ప్రభావం పడుతోంది. జీలకర్ర, లవంగాల ధరలు పేదలు, మధ్యతరగతి వారికి అందుబాటులో లేకుండా పోయాయి. మరోవైపు కూరగాయలు...ముఖ్యంగా టమాటాల ధరలు ఆకాశాన్ని తాకాయి. కిలో జీలకర్ర ధర ఏప్రిల్‌లో రూ.400 ఉంటే ఇప్పుడు రూ.750కి చేరింది. పుచ్చ గింజలు కూడా కిలో రూ. 750 పలుకుతున్నాయి. మూడు నెలల క్రితం వీటి ధర కేవలం రూ.300 మాత్రమే. లవంగాల ధర కూడా పెరిగింది. ఏప్రిల్‌లో కిలో లవంగాల ధర వెయ్యి రూపాయలు ఉండగా ఇప్పుడు 1200 రూపాయలకు చేరింది. దిగుబడి తగ్గడం వల్లనే వీటి ధరలు పెరిగాయని వ్యాపారులు అంటున్నారు. బైపర్‌జాయ్ తుపాను కారణంగా రవాణాకు ఆటంకం కలగడం, రుతుపవన వర్షాలు కూడా ఈ పరిస్థితికి కారణమయ్యాయని వారు తెలిపారు. దీంతో డిమాండ్, సరఫరాల మధ్య బాగా తేడా వచ్చింది. ధరల పెరుగుదలపై తామేమీ చేయలేమని వ్యాపారులు నిస్సహాయత వ్యక్తం చేశారు. మూడు నెలల కాలంలోనే ధరలు రెట్టింపు అయ్యాయని చెప్పారు.



9.8 కోట్లకు చేరిన చైనా కమ్యూనిస్టు పార్టీ సభ్యత్వం

బీజింగ్: 2022 చివరి నాటికి చైనా కమ్యూనిస్టు పార్టీ (సిపిసి)మొత్తం సభ్యత్వం 9 కోట్ల80లక్షల 41వేలకు చేరింది. అంతకుముందు సంవత్సరంతో పోల్చితే 1.4 శాతం పెరుగుదల ఉంది. సిపిసి 102వ వ్యవస్థాపక వార్షికోత్సవం(జులై1) సందర్భంగా పార్టీ నిర్మాణ వ్యవహారాల విభాగం తాజాగా ఈ వివరాలను వెల్లడించింది. సిపిసి ప్రాథమిక యూనిట్లు గత సంవత్సరం ఆఖరునాటికి 50,06,500 ఉన్నాయి. అంతకు ముందు సంవత్సరంతో పోల్చితే 1,29,000 యూనిట్లు పెరిగాయి పార్టీ నిర్మాణ వ్యవస్థ పటిష్టవంతమైందని, పార్టీ గవర్నెన్స్ మూలాలు దృఢంగానే ఉన్నాయని నిర్మాణ విభాగం తెలిపింది. 2022లో దాదాపు 24 లక్షల 50 వేల మంది కొత్తగా పార్టీలో చేరినట్లు అధికారిక గణాంకాలు తెలియజేస్తున్నాయి. అయిదేళ్లకు ఒక సారి జరిగే సిపిసి మహాసభ గత ఏడాది జరిగిన సంగతి తెలిసిందే. 2022 చివరి నాటికి పార్టీ మొత్తం సభ్యత్వంలో మహిళా సభ్యుల సంఖ్య 2కోట్ల 93 లక్షలకు చేరింది. అంతకు ముందు సంవత్సరంతో పోల్చితే 0.5 శాతం పెరుగుదల ఉంది. పార్టీలో మైనార్టీ తెగల ప్రాతినిధ్యం ఈ కాలంలో 0.1 శాతం నుంచి 7.6 శాతానికి పెరిగినట్లు ఆ డేటా తెలియజేస్తోంది. అలాగే సిపిసి సభ్యుల్లో అత్యధికులు పార్టీ పునాది వర్గాలైన కార్మిక కర్షక కుటుంబాల నుంచి వచ్చినవారే ఉన్నారు. మొత్తం సభ్యుల్లో వీరు 33.3 శాతంగా ఉన్నట్టు సిపిసి డేటా తెలిపింది.

2018 లా కమిషన్ నివేదికే..ప్రాతిపదిక

- నేడు స్టాండింగ్ కమిటీ సమావేశం

న్యూఢిల్లీ : ఉమ్మడి పౌర స్మృతి (యుసిసి)పై సోమవారం నుంచి పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ చర్చలను ప్రారంభించనుంది. ఈ చర్చలకు న్యాయ వ్యవహారాల శాఖ, శాసన శాఖ, లా కమిషన్ ఆఫ్ ఇండియా ప్రతినిధులను స్టాండింగ్ కమిటీ ఆహ్వానించింది. ఈ చర్చలో 2018 లా కమిషన్ నివేదికనే స్టాండింగ్ ప్రాతిపదికగా తీసుకోనుంది. యుసిసికి వ్యతిరేకంగా 2018 లా కమిషన్ నివేదిక ఇచ్చిన సంగతి తెలిసిందే. యుసిసిని అమలు చేసే కంటే సమానత్వానికి ప్రాధన్యత ఇచ్చే నిర్దిష్ట సార్వత్రిక సూత్రాలను అమలు చేయాలని సిఫార్సు చేసింది. యుసిసి అవసరం లేదని స్పష్టం చేసింది. బిజెపి ఎంపి సుశీల్ మోడీ నేతృత్వంలోని లా అండ్ జస్టిస్ పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీలో వివిధ పార్టీల ఎంపిలు సభ్యులుగా ఉన్నారు. కాంగ్రెస్‌కు చెందిన వారు నలుగురు ఉన్నారు.

9 బిల్లులను తొక్కిపెట్టిన కేరళ గవర్నరు

- సుప్రీంకోర్టును ఆశ్రయించనున్న ఎల్‌డిఎఫ్ సర్కార్

తిరువనంతపురం : ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన ప్రభుత్వాలపై రాజ్‌భవన్‌ల ద్వారా కేంద్ర ప్రభుత్వం పరోక్షంగా ఆధిపత్యం చెలాయిస్తోంది. గవర్నర్ల వ్యవస్థను దుర్వినియోగం చేసి ప్రతిపక్షాల పాలిత రాష్ట్రాల్లోని ప్రభుత్వాలను వేధింపులకు గురిచేస్తోంది. ప్రజా సంక్షేమం కోసం చట్టసభలు చేసిన బిల్లులను సైతం గవర్నర్ల ద్వారా తొక్కిపెడుతోంది. ఇది అక్కడి పాలన వ్యవహారాలను స్థభింపే కుట్రకు పాల్పడటమేనని రాజ్యాంగ నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కేరళలో ఎల్‌డిఎఫ్ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలతో జాతీయ స్థాయిలోనే మెప్పు పొందుతోంది. కేంద్ర సంస్థలు నిర్వహించే సర్వేల్లోనూ, అధ్యయనాల్లోనూ కేరళ మెరుగైన స్థితిలో ఉంటోంది. ఈ క్రమంలో రాష్ట్రాభివృద్ధి కోసం , ప్రజలకు మెరుగైన జీవనోపాధులు కల్పించేందుకు ఉద్దేశించిన శాసనసభలో తొమ్మిది బిల్లులను ఆమోదించారు. అయితే ఈ బిల్లులకు ఆమోదం తెలపకుండా, వాటిని తిప్పిపంపకుండా రాష్ట్ర గవర్నరు ఆరీఫ్ మహ్మద్ ఖాన్ తొక్కిపెట్టారు. వీటిపై త్వరగా నిర్ణయం తీసుకోవాలని ముఖ్యమంత్రి పినరయి విజయన్ నేతృత్వంలోని ఎల్‌డిఎఫ్ ప్రభుత్వం విజ్ఞప్తి చేసినా రాజ్‌భవన్ పట్టించుకోలేదు. ఈ నేపథ్యంలో బిల్లులు తొక్కిపెట్టడాన్ని సవాలు చేస్తూ సుప్రీంకోర్టును ఆశ్రయించాలని కేరళ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలిసింది. గవర్నర్ తీరుపై సుప్రీంకోర్టును ఆశ్రయించడం మినహా మరో మార్గం లేదని భావిస్తోంది. ఇలాంటి వివాదంలోనే ఇటీవల తెలంగాణ ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించిన సంగతి తెలిసిందే. వీలైనంత త్వరగా బిల్లులపై నిర్ణయం తీసుకోవాలని తెలంగాణ గవర్నర్ తమిళ సైను సుప్రీంకోర్టు ఆదేశించింది. బిల్లులను గవర్నర్ నిరవధికంగా తొక్కి ఉంచడం ప్రజాస్వామ్య వ్యవస్థ పతనానికి, ప్రభుత్వాలు పనిచేయడానికి నిర్దేశించిన రాజ్యాంగ ఫ్రేమ్‌వర్క్‌ను నిర్వీర్యం చేస్తుందని కేరళ ప్రభుత్వం వాదిస్తోంది. గవర్నర్ తీరుతో పరిస్థితిని చక్కదిద్దేందుకు అనుసరించాల్సిన చర్యలపై అడ్వకేట్ జనరల్ (ఎజి) అభిప్రాయాన్ని గతవారంలోనే కేరళ ప్రభుత్వం కోరింది.

భద్రతా లోపాలపై విచారణ

- అతిక్ హత్యపై సుప్రీంకు తెలిపిన యుపి ప్రభుత్వం

న్యూఢిల్లీ : గ్యాంగ్‌స్టర్, రాజకీయ నాయకులు అతిక్ అహ్మద్, అతని సోదరుడి హత్య సందర్భంలో 'భద్రతా లోపాలు'పై విచారణ జరిపిస్తామని సుప్రీంకోర్టుకు ఆదివారం ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం తెలిపింది. అలాగే ఈ హత్యలు జరిగిన షాహ్‌గంజ్ పోలీస్ స్టేషన్‌లోని నలుగురు పోలీసులు, స్టేషన్ హౌస్ ఆఫీసర్‌పై క్రమశిక్షణా చర్యలు ప్రారంభించే వరకూ సస్పెన్షనల్‌లో ఉంచినట్లు తెలిపింది. ఈ హత్యలపై ఇప్పటికే దర్యాప్తు ప్రారంభించామని తెలిపింది. ఏప్రిల్ 15న పోలీసుల కస్టడీలోనే ఉన్న అతిక్ అహ్మద్, అతని సోదరుడ్ని జర్నలిస్టుల ముసుగులో వచ్చిన ముగ్గురు దుండగలు అతి సమీపం నుంచి కాల్చి చంపిన సంగతి తెలిసిందే.

క్యూబా శాంతిని ప్రోత్సహిస్తుంది.. యుద్ధాన్ని కాదు

హవానా: దశాబ్దాలుగా దాడులు, ప్రతిదాడులతో కల్లోలంగా ఉన్న కొలంబియాలో వైరి వర్గాల మధ్య సయోధ్య కుదిర్చి, కాల్పుల విరమణకు వారిని ఒప్పింపజేయడంలో క్యూబా దౌత్యం ఫలించింది. కొలంబియాలోని నేషనల్ లిబరేషన్ ఆర్మీ (ఇఎల్ఎన్)కు, పెట్రో ప్రభుత్వానికి మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కుదర్చడంలో క్యూబా కీలక భూమిక వహించింది. ఈ సందర్భంగా క్యూబా అధ్యక్షుడు డియాజ్ కానెల్ మాట్లాడుతూ, మానవ సంఘీభావానికి ఎల్లలు లేవని, సంఘీభావం అనేది ఎవరూ నాశనం చేయలేని గొప్ప పోరాట ఆయుధమని అన్నారు. "అ మెరికా దిగ్బంధనం వల్ల క్యూబా ప్రజలు ఎన్ని ఇబ్బందులకు గురైనది, ఇప్పటికీ గురవుతున్నదీ ఆయన వివరించారు. ఇతర దేశాలపై వారు బాంబులు వేస్తారు .. మేము వైద్యులను పంపుతాము. వారు తమ ప్రపంచ ఆధిపత్యం కోసం ఇతర దేశాలపై యుద్ధాలు చేస్తారు. మేము శాంతిని పునరుద్ధరించేందుకు దౌత్యమార్గం గుండా ప్రయత్నిస్తాము.



కాల్పుల విరమణ ఒప్పందం కుదుర్చుకున్న అనంతరం కరచాలనం చేస్తున్న కొలంబియా అధ్యక్షుడు గుస్తావో పెట్రో, ఇఎల్‌ఎన్ కమాండర్ ఆంటోని గార్సియా. ఉభయులను అభినందిస్తున్న క్యూబా అధ్యక్షుడు మిగుయెల్ డియాజ్ కానెల్. (మధ్యలో)

మమ్మల్ని వారు ఉగ్రవాదులను ప్రోత్సహించే దేశాల జాబితాలో చేర్చుతారు. 1959లో విప్లవం విజయవంతమైన తరువాత వారు మాపై ఏకంగా ఆర్థిక యుద్ధమే ప్రకటించారు. దానిని సమర్ధించుకోవడానికి, మాపై మరిన్ని ఆంక్షలను విధించేందుకు ఉగ్రవాద ప్రోత్సాహక దేశం అన్న ముద్ర వేస్తున్నారు." అని క్యూబా అధ్యక్షుడు కానెల్ అమెరికా పేరెత్తకుండా ఆ దేశంపై విమర్శలు గుప్పించారు. అమెరికా ఆర్థిక దిగ్బంధనం వల్ల క్యూబా ఆర్థిక వ్యవస్థకు 14,400 కోట్ల డాలర్ల మేర నష్టం వాటిల్లిందని సాక్షాత్తూ ఐక్యరాజ్యసమితి స్వయంగా సెలవిచ్చింది. క్యూబాను ఉగ్రవాద ప్రేరేపిత దేశాల జాబితాలో చేర్చడం వల్ల దాని అంతర్జాతీయ వాణిజ్యాన్ని వారు అడ్డుకున్నారు. బయట దేశాల నుంచి రుణాలు కానీ, విదేశీ సాయం కానీ, వినియోగ వస్తువుల ఎగుమతులు కానీ జరగకుండా అడ్డుకున్నారు. ఇది క్యూబా ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపిందని డియాజ్ ఆనెల్ అన్నారు.

(మొదటి పేజీ తరువాయి)

ఎన్‌సిపిలో చీలిక

నేత పదవికి అజిత్ రాజీనామా చేశారు. ఆయన రాజీనామాను ఆమోదించాను' అని తెలిపారు. ఈ కార్యక్రమానికి డిప్యూటీ స్పీకర్ నరహరి జిర్వాల్, ఎన్‌సిపి వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రఫుల్ పటేల్ కూడా హాజరయ్యారు. శాసనసభలో ఎన్‌సిపికి 53 మంది ఎమ్మెల్యేలున్నారు. వీరిలో 40 మంది ఎమ్మెల్యేలు రాష్ట్ర ప్రభుత్వానికి మద్దతు తెలియజేస్తున్నారని బిజెపి మహారాష్ట్ర అధ్యక్షులు చంద్రశేఖర్ బవాంకులే తెలిపారు.


చీలిక కాదు..చేరికే ..: అజిత్

మహారాష్ట్రలోని ఎన్‌డిఎ ప్రభుత్వంలో చేరేందుకు ఎన్‌సిపిని తాము చీల్చలేదని, ఆ వాదనలు సరికాదని అజిత్ పవార్ పేర్కొన్నారు. ఉపముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ఎన్‌సిపిలో అందరి మద్దతూ తమకే ఉందని, భవిష్యత్‌లో జరిగే అన్ని ఎన్నికల్లోనూ ఎన్‌సిపి పార్టీ గుర్తు పైనే తాము పోటీ చేస్తామని చెప్పారు. ఎన్‌సిపి శాసనసభాపక్షం ఏక్‌నాథ్ షిండే ప్రభుత్వానికి మద్దతు ఇచ్చిందని తెలిపారు. పార్టీలో అందరూ ఎమ్మెల్యేలూ షిండే-ఫడ్నవీస్ ప్రభుత్వంలో భాగంగా కావాలని నిర్ణయించినట్లు అజిత్ తెలిపారు. ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు శివసేనతో కలిసి వెళ్లగలిగినప్పుడు ... బిజెపితో కలిసి ఎందుకు వెళ్లకూడదని విలేకర్లు అడిగిన ప్రశ్నకు ఆయన బదులిచ్చారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నేతృత్వంలో దేశం పురోగమిస్తోందని, ఆయన ఇతర దేశాల్లోనూ ప్రజాదరణ చూరగొంటున్నారని, రాబోయే లోక్‌సభ, శాసనసభ ఎన్నికల్లో బిజెపి కూటమితో కలిసి పోటీ చేస్తామని అజిత్ తెలిపారు. అందుకే మహారాష్ట్ర ప్రభుత్వంలో చేరామన్నారు. దేశాభివృద్ధి కోసమే ఎన్‌డిఎలో చేరామన్నారు. 'మేమంతా ఇక్కడే ఉన్నాం. ఎమ్మెల్యేలందరూ నాతోనే ఉన్నారు. మేమంతా ఇక్కడ పార్టీగానే ఉన్నాం. సీనియర్లందరికీ కూడా ఈ విషయం చెప్పాం. ప్రజాస్వామ్యంలో మెజార్టీకే అత్యంత ప్రాధాన్యం. 24 ఏళ్ల మా పార్టీకి యువ నాయకత్వం ముందుకు రావాలి' అని ఆయన ట్వీట్ కూడా చేశారు.

గుగ్లీ కాదు, దోపిడి : శరద్ పవార్

ఆదివారం చోటుచేసుకున్న పరిణామాలపై ఎన్‌సిపి అధినేత శరద్ పవార్ స్పందించారు. ఈ పరిణామాలు ఇతరులకు కొత్త కానీ, తనకు కాదని చెప్పారు. ఎన్‌డిఎలో అజిత్ పవార్ చేరడం గుగ్లీ కాదు, దోపిడీ అని ఆయన విమర్శించారు. ఎన్‌సిపి పేరును తీసుకొని ఎవరైనా ఏదైనా మాట్లాడితే తాము పోరాడతామని, ప్రజాక్షేత్రంలోనే తేల్చుకుంటామని ఆయన తెలిపారు. ఎన్‌సిపి ప్రధానబలం .. సామాన్య ప్రజలేనని శరద్ పవార్ పేర్కొన్నారు. శాసనసభలో ప్రతిపక్ష నేతగా అజిత్ రాజీనామా చేసిన నేపథ్యంలో ఆయన స్థానంలో సీనియర్ నేత జితేంద్ర అవద్‌ను ప్రతిపక్ష నేతగా నియమిస్తున్నట్లు శరద్ పవార్ ప్రకటించారు.

'నా ఇల్లు విడిపోయిందని నేనెప్పుడూ చెప్పను. ఈ సమస్య నా ఇంటిది కాదు. ప్రజల సమస్య. తిరుగుబాటు చేసి బిజెపి కూటమితో జట్టు కట్టిన నాయకుల భవిష్యత్తు గురించే నా ఆందోళన. అందులో కొందరు ఇడి కేసులను ఎదుర్కొంటున్నారు. రెండు రోజుల క్రిందటే ప్రధాని మోడీ ఒక ప్రకటన చేశారు. ఎన్‌సిపి ఫినిష్ అని అన్నారు. అందుకేనేమో కొందరు నాయకులు భయపడి ఎన్‌డిఎలో చేరారు. మా పార్టీలో కొందరు ఎమ్మెల్యేలు మంత్రులుగా ప్రమాణం చేసినందుకు సంతోషిస్తున్నా. మహారాష్ట్ర ప్రజలపై.. ముఖ్యంగా యువతపై నాకు విశ్వాసముంది. ప్రజల వద్దకే వెళ్లి తేల్చుకుంటా.' అని శరద్ పవార్ పేర్కొన్నారు.


శరద్ పవార్

చర్యలు తీసుకుంటాం..

పార్టీ వైఖరిని ఉల్లంఘించి ఏక్‌నాథ్ షిండే నేతృత్వంలోని శివసేన, బిజెపి ప్రభుత్వంలో చేరినవారిపై చర్యలు తీసుకుంటామని ఎన్‌సిపి అధి నేత శరద్ పవార్ చెప్పారు. శివసేన- బిజెపి ప్రభుత్వంలో చేరాలనేది పార్టీ వైఖరి కాదని ఆయన స్పష్టం చేశారు. మహారాష్ట్రలో పార్టీ రాష్ట్ర శాఖ ఏ వైఖరి తీసుకుందనేది మాకు ముఖ్యం కాదు, వారు మహారాష్ట్ర ప్రభుత్వంలో చేరడం పార్టీ వైఖరి కాదు. కాబట్టి దీనిపై చర్యలు తీసుకుంటామని పవార్ అన్నారు. ఈ ప్రక్రియ త్వరలోనే ప్రారంభమవుతుందని తెలిపారు.


ఆరుగురే మిగిలినా... నిరాశ లేదు..

'1980లో నేను నాయకత్వం వహించిన పార్టీలో 58 మంది ఎమ్మెల్యేలు ఉన్నారు. అందులో కొందరు పార్టీపై తిరుగుబాటు చేశారు. ఆఖరికి ఆరుగురు మాత్రమే నావెంట ఉన్నారు. కానీ నేను నిరాశ చెందలేదు. పార్టీని బలపరిచా. నన్ను వెన్నుపోటు పొడిచినవారు తర్వాత జరిగిన ఎన్నికల్లో ఓడిపోయారు. నాకు కాంగ్రెస్ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే, బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ఫోన్ చేశారు. నేను ఈ రోజు జరిగిన పరిణామాల పట్ల చింతించట్లేదు.' అని శరద్ పవార్ అన్నారు.

మహారాష్ట్రకు త్వరలో కొత్త ముఖ్యమంత్రి : సంజయ్ రౌత్

మహారాష్ట్ర ప్రభుత్వంలో అజిత్ పవార్ చేరడం.. ఏక్‌నాథ్ షిండే ముఖ్యమంత్రి పదవి కోల్పోవడానికి నాంది అని శివసేన (ఉద్ధవ్ గ్రూపు) నాయకులు సంజయ్ రౌత్ అన్నారు. మహారాష్ట్రకు త్వరలోనే కొత్త ముఖ్యమంత్రి వస్తారని ఆయన చెప్పారు. అజిత్ బిజెపితో జట్టు కడతారని తమకు ముందే తెలుసునని ఆయన పేర్కొన్నారు.

ప్రభుత్వాల నిర్మాణంలో ఇడి, సిబిఐ : ఏచూరి



కేంద్ర దర్యాప్తు సంస్థలైన ఇడి, సిబిఐలను ప్రతిపక్షాలపై ఆయుధాలుగా ఉపయోగిస్తుండటంతో అవే రాష్ట్రాల్లో ప్రభుత్వాల నిర్మిస్తున్నాయని సిపిఎం ప్రధానకార్యదర్శి సీతారాం ఏచూరి విమర్శించారు. మహారాష్ట్రలో చోటుచేసుకున్న పరిణామాలపై ఆయన స్పందిస్తూ ఒక వైపు మణిపూర్‌లో మళ్లీ హింసాకాండ చెలరేగి మండుతోంటే..ఇటు ప్రతిపక్షాలను చీల్చడంలో మోడీ సర్కార్ నిమగ్నమైందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేస్తూ ట్వీట్ చేశారు.

మదర్ ఆఫ్ డెమొక్రసీ అంటే ఇదేనా! :సిబాల్



మహారాష్ట్రలో చోటుచేసుకున్న అనూహ్య పరిణామాలపై సీనియర్ న్యాయవాది, రాజ్యసభ సభ్యులు కపిల్ సిబల్ తనదైన రీతిలో వ్యంగ్యాస్త్రాలు సంధించారు. అమెరికా పర్యటనలో భారత్‌ను ప్రజాస్వామ్య మాతృమూర్తిగా ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అభివర్ణించారని, ఆ ప్రజాస్వామ్య మాతృమూర్తిగా ఇలేగా ఉంటారా? అంటూ కపిల్ ప్రశ్నించారు. 'అమెరికా కాంగ్రెస్‌లో ప్రసంగిస్తూ మోడీజీ అభివర్ణించిన ప్రజాస్వామ్య మాతృమూర్తి ఇలాగే ఉంటారేమో!' అని ఆయన ట్వీట్ చేశారు.

అప్పుడు మధ్య ప్రదేశ్, ఇప్పుడు మహారాష్ట్ర : అఖిలేశ్



బిజెపి సమయం వచ్చినప్పుడుల్లా ఇలాంటి కుట్రలకు పాల్పడుతోందని సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్ విమర్శించారు. 'వాళ్లు (బిజెపి) మొదట మధ్యప్రదేశ్‌లో ఇలాంటి కుట్రలకు పాల్పడ్డారు. ఇప్పుడు మహారాష్ట్రలో కొనసాగిస్తున్నారు. వీలున్నప్పుడల్లా బిజెపి ఇలాంటి కుయుక్తులకు పాల్పడుతోంది. ప్రజలు ఇదంతా గమనిస్తూనేవున్నారు' అని అఖిలేశ్ అన్నారు.




మీకోసం

అల్లం, వెల్లుల్లి ముద్ద చేసేటప్పుడు కొద్దిగా నూనె వేస్తే పేస్టు మెత్తగా వస్తుంది. ఎక్కువ రోజులు నిల్వ ఉంటుంది.

జీవన సౌరభం

వినేందుకు కటువుగా అనిపించినా మీ గురించి వాస్తవాలు చెప్పే వారి సలహాలు తీసుకోవడం మంచిది.

కొంగ - జపం



కొంగ ఒకటి ఉంది
ఆటలాడుకుంది
ఆడిపాడి ఆకలైంది
చెరువు చేరుకుంది

ఒంటి కాలిపై నిల్చుంది
చేప కొరకు చూసింది
దగ్గరకొక్కటీ రాకుంది
వేచి వేచి చూస్తుంది

కప్ప కొంగను చూసింది
ఎందుకిలా నిలబడింది?
తేరిపార చూసింది
దొంగ జపము దేనికంది?

దొంగ జపము కాదిది
తెలియకే కాలు లేస్తుంది
మనిషి కళ్ళు కొట్టినట్లు
సహజంగా జరుగుతుంది

రెండు కాళ్ళు ముంచితే
శరీరం చల్ల చల్లగౌతది
శరీర వేడి సమతుల్యతకే
ఒంటి కాలి జపమన్నది

చేప దరికి చేరింది
ముక్కు నీట ముంచింది
చేప దొరికి పోయింది
గుటుక్కుమని మింగింది

నన్ను దొంగ జపమనకు
మాంసాహారమే తినేది
ప్రకృతి నేర్పిన ధర్మమిది
దానిననుసరించుటే విధి

- ఆవుల చక్రపాణి యాదవ్
99633 50973

తేడాలు గుర్తించండి

పిల్లలూ! ఈ చిత్రంలో ఏడు తేడాలు ఉన్నాయి. అవి ఏంటో గుర్తించండి.





నేను గీసిన బొమ్మ



- బోరుగడ్డ వివేకవర్ధిని,
1వ తరగతి,
కోటక్ సేల్సియన్ స్కూలు,
విశాఖపట్నం.



పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

నా చుట్టూ
భయంకర పరిస్థితి సృష్టిస్తున్నారు...



తులసీ చందు ...
ఇటీవల కాలంలో ప్రజల సమస్యలపైనా, ప్రభుత్వాల నిర్ణయాల పైనా విశ్లేషణాత్మక కథనాలు అందిస్తున్న బలమైన గొంతుక. ఆమె ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాలో నైపుణ్యవంత జర్నలిస్టుగా రాణించారు. ఆపై ఆరోగ్య సమస్యలతో వృత్తికి కొంత విరామం ఇచ్చిన ఆమె ఆ తరువాత స్వతంత్ర జర్నలిస్టుగా ప్రస్థానం సాగిస్తున్నారు. సొంతంగా యూట్యూబ్ చానెల్ పెట్టి అందులో ఎన్నో విషయాలపై సమగ్ర నివేదికలు అందిస్తున్నారు. ఎంచుకున్న ఏదేని అంశంమైనా సుస్పష్టమైన వివరాలతో.. విశ్లేషణలతో ఆమె చేస్తున్న వీడియోలను వేలాదిమంది అనుసరిస్తున్నారు. ఇష్టపడుతున్నారు. అయితే, మతోన్మాద శక్తులు కొన్ని పనికట్టుకొని ఆమెపై దుష్ప్రచారానికి, దుర్మార్గమైన ఆరోపణలకు దిగుతున్నాయి. ఈ నేపథ్యంలో తులసితో 'జీవన' ముచ్చటించింది.

'కొందరు నా చుట్టూ ప్రమాదకరమైన పరిస్థితిని సృష్టిస్తున్నారు. నన్నెప్పుడూ చూడని కొన్ని సందేహాత్మక చూపులు పదే పదే నన్ను వెన్నాడుతున్నాయి. దీంతో ఎవరు.. ఎక్కడ.. ఎటువైపు నుంచి దాడి చేస్తారో తెలియని అయోమయ పరిస్థితికి వెళ్లిపోయాను. నా ఆందోళన చూసి నా బిడ్డలు తల్లడిల్లుతున్నారు. 'అమ్మకు ఏమవుతోందో'నని బెంబేలు పడిపోతున్నారు. జర్నలిస్టుగా నిజాన్ని వెలికితీయడంలో ముందుండే నేనూ ఓ అమ్మనే.. బిడ్డల భవిష్యత్తుకై ఎన్నో అందమైన కలలు కన్నాను. అందుకే ప్రస్తుతం నా చుట్టూ ఉన్న భయంకర వాతావరణానికి తీవ్ర మానసిక వేదనకు గురౌతున్నాను..' అంటూ ఆవేదన వ్యక్తం చేశారు జర్నలిస్టు తులసీ చందు. తాను చేస్తున్న కృషి గురించి తన మాటల్లోనే ...

తులసీచందు యూట్యూబ్ చానెల్

'2020 ఏడాది చివరిలో నా పేరుతోనే యూట్యూబ్ చానెల్ ప్రారంభించాను. ఇప్పటి వరకు 300 పైగా వీడియోలు చేశాను. వాటిలో 100 నుంచి 150 వరకు విశ్లేషణాత్మక వివరాలతో పలు అంశాలపై చేసిన వాటికి విశేష స్పందన వచ్చింది. రాజధానిలో రైతు చట్టాలకు వ్యతిరేకంగా రైతులు ధర్నా చేస్తున్న సమయంలో ఆ చట్టాలను వివరిస్తూ నాలుగు వీడియోలు చేశాను. ప్రముఖులను ఇంటర్వ్యూ చేశాను. వైజాగ్ స్టీలుప్లాంటు కార్మికుల ఆందోళన జరుగుతున్నప్పుడు పాలకులు పరిశ్రమలను ఎలా దుర్వినియోగం చేస్తున్నారో వివరిస్తూ ... గుజరాత్ స్టీలు కంపెనీ నిర్వీర్యం అయిన క్రమాన్ని వివరించాను. దాన్ని నిలబెట్టుకోవడం కోసం ప్రభుత్వ సంస్థలను ఎలా వాడుకున్నారో విశ్లేషించాను.

చానెల్ ప్రారంభించిన తొలినాళ్లల్లో రెండు నిమిషాల నిడివిలో 'మతం వస్తోంది.. మేలుకో మిత్రమా' అంటూ ఓ వీడియో చేశాను. జిహెచ్ఎంసి ఎన్నికలు జరుగుతున్న సమయంలో చేసిన ఆ వీడియో చాలా మందిని ప్రభావితం చేసింది. బెదిరింపు మెసేజ్‌లు, కాల్స్ రావడం అప్పటి నుండే ప్రారంభమైంది. విదేశాల నుంచి కూడా బెదిరింపులు వచ్చేవి.

ప్రజా చైతన్యమే ముఖ్యం

జనం ఏది తెలుసుకోవాలి.. ఏది ముఖ్యం.. రాజ్యాంగం ఏం చెప్పింది? వంటి అంశాలతో పాటు, పాలకులు ప్రజలకు సేవ చేయాలి అనే విషయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి. కానీ పరిస్థితి అలా లేదు. పాలకులు ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారు. మతాన్ని తీసుకొచ్చి ఉన్మాదం పెంచుతున్నారు. ప్రజలు పాలకుల కుయుక్తులను అర్థం చేసుకోవాలి. అందుకే నా వీడియోలన్నీ ప్రజలకు మేలు చేసేవి.. వాళ్లను మేల్కొల్పేవిగా ఉంటాయి. డబ్బు కోసం కంటే సమాజానికి ఉపయోగపడే.. ప్రజలను చైతన్యం చేసే వీడియోలు చేయడం నాకు ఇష్టం. అందుకే నేను చేసిన వీడియోలలో ఎక్కువశాతం అవే ఉంటాయి.

సరైన సమాచారం అందివ్వాలని ...


జర్నలిజం అంటే నా దృష్టిలో ప్రజలకు సరైన సమాచారం అందించాలి. వ్యవస్థను ప్రశ్నిస్తున్నప్పుడు లోపం ఎక్కడుందో వివరించాలి. కులం పేరుతో, మతం పేరుతో, వ్యక్తిగతంగా దూషించడం జర్నలిజం మార్గం కాదని నేను బలంగా నమ్ముతాను. నా వీడియోల్లో ఎక్కడా ఎవరినీ దూషించలేదు. వ్యవస్థను నిర్వీర్యం చేసే వారి చర్యలను వివరిస్తూ.. ప్రజలను హెచ్చరించేలా నా వీడియోలు ఉంటాయి. జర్నలిజంపై నాకున్న మక్కువతో 250 మంది విద్యార్థులకు శిక్షణ ఇచ్చాను. వారిలో చాలా మంది సొంతంగా చానెళ్ల ప్రారంభిస్తున్నారు. సమాజానికి చైతన్యం అందించే నా బాధ్యతలో వారు కూడా భాగస్వామ్యం అవ్వడం నాకు చాలా సంతోషాన్ని ఇస్తోంది.

తీవ్రంగా బాధిస్తోంది..

నేను చేసిన వీడియోలలో వ్యవస్థను జాగృత్తం చేసేవే ఉంటాయి. వాటిని తప్పుపట్టడానికి వీల్లేక.. నా మీద వ్యక్తిగత దాడికి దిగుతున్నారు. నన్ను హిందూ వ్యతిరేకి అంటున్నారు. అర్బన్ నక్సలైట్ ముద్ర వేశారు. పనిగట్టుకుని మూడు యూట్యూబ్ చానెళ్లు నాపై విష ప్రచారం చేస్తున్నాయి. 'అహం బ్రహ్మస్మి', 'మతోన్మాదంపై రామబాణం', 'ఆర్ జె కిరణ్' పేరుతో రిజిస్టర్ అయిన చానెళ్లతో పాటు 'పాస్టర్ పరంజ్యోతి' పేరుతో ఉన్న ఫేస్‌బుక్ పేజీలో నాపై చెడ్డ వార్తలు వ్యాపింపజేస్తున్నారు. ఈ ప్రచారం వల్ల కొంతమందికి నేను శత్రువును అవుతున్నాను. ఆ వీడియోల ప్రభావంతో ఎంతమంది ప్రేరేపితమవుతున్నారో నాకు తెలియదు. నన్ను చంపుతామని నేరుగా బెదిరించకపోయినా ఇలా నా చుట్టూ భయంకర వాతావరణం సృష్టిస్తున్నారు. అమాయకులను నాపై ఉసిగొల్పుతున్నారు. అదే నన్ను తీవ్రంగా బాధిస్తోంది..

ఇప్పటికే మార్కెట్లో.. బస్సుల్లో.. పార్కుల్లో, ఊర్లో నన్ను నేరుగా ప్రశ్నించిన వారున్నారు. శారీరకంగా నాపై దాడి చేయడం కంటే ఇది ఘోరమైనది. నన్ను విమర్శించవచ్చు.. నన్ను కౌంటర్ చేయొచ్చు.. కానీ నాపై కొంతమందిని రెచ్చగొట్టడం సరికాదు. ఒక మతానికో.. పార్టీకో నేను పరిమితం కాదు. ఎవరికీ లోబడి వీడియోలు చేయలేదు. అయినా నాపై దుష్ప్రచారం చేస్తున్నారు. కులం మీద మాట్లాడితే నేను దళితురాలిని. మతం మీద మాట్లాడితే ముస్లింని. ఇలా వారికిష్టమొచ్చిన కులం, మతం నాకు ఆపాదిస్తున్నారు' అంటూ తులసీ తీవ్ర ఆవేదన చెందుతున్నారు. ఈ ఆవేదనతోనే తులసీ ఇటీవల ఓ లేఖను సోషల్ మీడియాలో విడుదల చేశారు. ఆ లేఖకు విశేష స్పందన వస్తోంది. ఆమెకు అండగా రెండు తెలుగు రాష్ట్రాల నుంచి అనేక ప్రజాసంఘాల కార్యకర్తలు, ప్రముఖులు అండగా నిలబడ్డారు. ప్రశ్నించే గొంతుకలను అణిచివేయాలని ఉన్మాద శక్తులు చూసిన ప్రతిసారీ ప్రజల నుంచి బలమైన సంఘీభావం అవసరం.

- జ్యోతిర్మయి



అరాచక శక్తులపై చర్య తీసుకోవాలి

ఎన్నో అవార్డులు, రివార్డులు పొందిన ప్రతిభ తులసి చందుది. లక్షలమంది అభిమానించే చైతన్య గొంతుక తనది. నిరుద్యోగం, రైలు ప్రమాదాలు, టీచర్ల ఉద్యోగాలు, పెట్రోలు ధరలు, భారీ పరిశ్రమలు, మణిపూర్ హింస, రైతు చట్టాలు, మతం బూచి ఆమె చేసిన వీడియోల్లో కొన్ని. ఇవన్నీ సమాజాన్ని ప్రభావితం చేసేవే.. సమాజాన్ని చైతన్యం చేసే బాధ్యత ఎవరు భుజాన వేసుకున్న పాలకులకు నచ్చదు. ఏదోవిధంగా ఆ ప్రశ్నించే గొంతుకలను చిదిమేయాలని చూస్తారు. కర్నాటక గౌరీ లంకేష్, గుజరాత్ రానా అయ్యూబ్, కేరళ సిద్దిఖీ వంటి వారిపై జరిగిన దాడులు వెలుగులోకి వచ్చినవే. ఇలాంటి అరాచక మూకల ఆగడాలను ప్రారంభంలోనే అరికట్టాలి. అవమానకరంగా, అమానుషంగా వ్యాఖ్యలు చేస్తున్న దశలోనే అడ్డుకట్ట వేయాలి. ప్రజల గొంతుకగా నిలిచే జర్నలిస్టులపై రెచ్చగొట్టుడు పనికి పూనుకుంటున్న అరాచక శక్తులపై పోలీసులు చర్యలు తీసుకోవాలి.

నాణ్యత నిర్ధారించాకే 'పోలవరం' పనులు

- వి శ్రీనివాసరావు డిమాండ్

ప్రజాశక్తి- కష్ణా ప్రతినిధి, గన్నవరం

పోలవరం ప్రాజెక్టు నాణ్యతను నిర్ధారించిన తర్వాతే పనులు కొనసాగించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. పోలవరం నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సాగుతున్న పోరుకేక మహా పాదయాత్ర 13వ రోజు ఆదివారం కృష్ణా జిల్లా హనుమాన్ జంక్షన్ నుంచి గన్నవరం వరకూ సాగింది. రాత్రి గన్నవరం పట్టణం ఆగిరిపల్లి రోడ్డులోని మూడు బొమ్మల సెంటరులో జరిగిన బహిరంగ సభలో వి.శ్రీనివాసరావు మాట్లాడారు. పోలవరం గైడ్ బండ్ ఇటీవల కుంగిందని తెలిపారు. కాఫర్ డ్యాంకు చిల్లులు పడ్డాయని చర్చ నడుస్తోందన్నారు. ఈ నేపథ్యంలో పోలవరం ప్రాజెక్టు నాణ్యత నిర్ధారించాల్సి ఉందని తెలిపారు. ప్రపంచ స్థాయి నిపుణులతో సర్టిపై చేసిన తర్వాత మాత్రమే ప్రాజెక్టు పనులు కొనసాగించాలని డిమాండ్ చేశారు. నాణ్యత ధ్రువీకరించకుండా డ్యాం నిర్మాణం కొనసాగించడం సరైంది కాదన్నారు. పోలవరం నిర్వాసితుల సమస్యలపై కేంద్ర, రాష్ట్ర పాలకులు సానుకూలంగా స్పందించకపోతే ప్రజలు తగిన గుణపాఠం చెప్తారని హెచ్చరించారు. గన్నవరం నియోజకవర్గానికి పుచ్చలపల్లి సుందరయ్య ప్రాతినిధ్యం వహించారని గుర్తు చేశారు. ఈ ప్రాంత ప్రజలు పదేపదే సుందరయ్యను జ్ఞాపకం చేసుకుంటుంటారన్నారు. అలాంటి సుందరయ్యకు వారసులుగా ఉన్న సిపిఎం... పోలవరం నిర్వాసితుల సమస్య పరిష్కారానికి మహా పాదయాత్ర నిర్వహిస్తోందన్నారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ నిర్వాసితుల సమస్యలపై కేంద్రంలోని బిజెపి, రాష్ట్రంలోని అధికార వైసిపి నోరు మెదపకపోవటం దారుణమన్నారు. పోలవరం నిర్వాసితుల సంఘం నాయకులు వాణిశ్రీ మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టు వల్ల ఎనిమిది మండలాల్లో గిరిజనులు పూర్తిగా ఇల్లు, భూములు కోల్పోతున్నా వారిని ఆదుకునేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ముందుకు రాకపోవడం దుర్మార్గమన్నారు. ఎపి మేధావుల సంఘం నాయకులు ఎన్.మహేశ్వరరావు మాట్లాడుతూ నిర్వాసితులకు ప్యాకేజీ ఇవ్వకుండా ప్రాజెక్టు పూర్తి చేయాలనుకోవడం అవివేకమన్నారు. సిపిఎం కృష్ణా జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆర్.రఘు మాట్లాడారు. సభకు సిపిఎం గన్నవరం మండల కార్యదర్శి మల్లంపల్లి ఆంజనేయులు అధ్యక్షత వహించారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.వెంకటేశ్వర్లు, మంతెన సీతారామ్, సిహెచ్ బాబూరావు, కృష్ణా, ఏలూరు, రంపచోడవరం జిల్లాల కార్యదర్శులు వై.నరసింహారావు, ఎ.రవి, బి.కిరణ్ తదితరులు పాల్గొన్నారు.



వీరవల్లిలో ఉత్సాహంగా నృత్యం చేస్తున్న గిరిజన యువత

గ్రామగ్రామాన ఘన స్వాగతం

మహా పాదయాత్ర 13వ రోజు ఆదివారం కృష్ణా జిల్లా బాపులపాడు మండలం హనుమాన్ జంక్షన్ నుంచి గన్నవరం వరకూ కొనసాగింది. గ్రామగ్రామాన పేదలు, రైతులు, కార్మికులు, టిడిపి, వైసిపి నాయకులు ఘన స్వాగతం పలికారు. నిర్వాసితుల పోరాటానికి తమ మద్దతు ప్రకటించారు. వీరవల్లి ముఖద్వారం వద్ద తెలుగు రైతు రాష్ట్ర నాయకులు గుండపనేని ఉమావరప్రసాద్ స్వాగతం పలికి సంఘీభావం తెలిపారు. గ్రామంలోని సచివాలయం సెంటర్లో ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ ఉద్యోగులు స్వాగతం పలికారు. ఎన్‌టిఆర్ బొమ్మ సెంటర్‌లో వైసిపి నాయకులు కృష్ణప్రసాద్, చిలకపాటి పద్మనాభరావు, ఇతర రైతు నాయకులు, గ్రామ పెద్దలు యాత్రకు పూలతో స్వాగతం పలికి సంఘీభావం తెలిపారు. యాత్రా బృందానికి మజ్జిగ, తాగు నీరు అందించారు. పెద్ద అవుటపల్లిలో ఉపాధి కార్మికులు, మహిళలు పెద్ద ఎత్తున స్వాగతం పలికారు. ఆత్కూరులో తెలంగాణ సాయుధపోరాటయోధుడు అన్నే రామారావు విగ్రహానికి శ్రీనివాసరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఆర్‌టిసి రక్షణకు ఉద్యమాలకు సిద్ధం కావాలి

- ఎఐఆర్‌టిడబ్ల్యుఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి ఆర్.లక్ష్మయ్య

ప్రజాశక్తి-గుంటూరు

ఆర్‌టిసి రక్షణకు ప్రజలతో కలిసి విస్తృత ఉద్యమాలకు సిద్ధం కావాలని అఖిల భారత రోడ్డు రవాణా కార్మిక సమాఖ్య జాతీయ ప్రధాన కార్యదర్శి ఆర్.లక్ష్మయ్య కార్మికులకు పిలుపునిచ్చారు. గుంటూరులోని సిఐటియు కార్యాలయంలో ఆర్‌టిసి స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కమిటీ సమావేశం ఆదివారం జరిగింది. సమావేశంలో లక్ష్మయ్య మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ఒకే దేశం, ఒకే పర్మిట్ పేరుతో ప్రయివేటు రవాణాకు గేట్లు ఎత్తిందన్నారు. కేంద్రం నిర్ణయాలకు రాష్ట్ర ప్రభుత్వం వత్తాసు పలుకుతూ ప్రయివేటీకరణ విధానాలు అమలు చేస్తోందని తెలిపారు. అందులో భాగంగానే ఆర్‌టిసి వర్క్‌షాప్‌లలో ప్రయివేటు సంస్థలకు పనులు అప్పగిస్తున్నారని విమర్శించారు. అద్దె ప్రాతిపదికన విద్యుత్ బస్సులు ప్రవేశపెడుతున్నారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తోన్న విధానాల వల్ల ఆర్‌టిసి మనుగడ ప్రశ్నార్థకంగా మారిందని పేర్కొన్నారు. ఆర్‌టిసి ఉద్యోగులందరికీ పాత పింఛను అమలు చేయాలని డిమాండ్ చేశారు. సిఐటియు రాష్ట్ర నాయకులు ఎం.ఎ.గపూర్ మాట్లాడుతూ ఆర్‌టిసి కార్మికులు పింఛనుతో కూడిన విలీనం కోరుకున్నారని, పింఛను లేని విలీనం వలన ప్రయోజనం ఏమిటని ప్రశ్నించారు. ఆర్‌టిసిలో అద్దె బస్సు కార్మికులు, ఆన్‌కాల్ డ్రైవర్లు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు శ్రమ దోపిడీకి గురవుతున్నారని, వారికి ప్రభుత్వ నిబంధనల ప్రకారం కనీస వేతనాలు, సౌకర్యాలు అమలుకావట్లేదని, దీనికి ఆర్‌టిసి అధికారులు బాధ్యత వహించాల్సి ఉంటుందని తెలిపారు. ఎస్‌డబ్ల్యుఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీరాం అయ్యపురెడ్డి మాట్లాడుతూ.. జులై 13, 14 తేదీల్లో వర్క్‌షాప్‌లు, గ్యారేజీలలో ప్రయివేటీకరణ విధానాలను నిరసిస్తూ, పాతపింఛను అమలు చేయాలని, ట్రెజరీలలో పెండింగ్ లేకుండా బిల్లులు చెల్లింపులు చేయాలని డిమాండ్ చేస్తూ అన్ని జిల్లా కేంద్రాల్లో నిరసన కార్యక్రమం చేయాలని పిలుపునిచ్చారు. సమా వేశంలో ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు సిహెచ్.సుందరయ్య, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జె.దివాకర్, కట్టా సుబ్రహ్మణ్యం, యం హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఆసియా క్రీడలకు ఇషా సింగ్

- బాక్సర్ నిఖత్ జరీన్ సైతం..



హైదరాబాద్ : తెలంగాణ యువ షూటర్, జూనియర్ ప్రపంచకప్ ఛాంపియన్ ఇషా సింగ్ ఆసియా క్రీడలకు ఎంపికైంది. సెప్టెంబర్ 23 నుంచి చైనాలోని హాంగ్జౌలో జరుగనున్న ఆసియా క్రీడలకు భారత రైఫిల్ సంఘం (ఎన్‌ఆర్‌ఎఐ) ఆదివారం జట్టును ప్రకటించింది. పిస్టల్ షూటింగ్ విభాగంలో ఇషా సింగ్ జట్టులో చోటు సాధించింది. ఆసియా క్రీడల్లో పోటీపడనున్న షూటింగ్ బృందంలో ఇషా సింగ్ అత్యంత పిన్న వయస్కురాలు. మహిళల ఎయిర్ పిస్టల్ విభాగం, 25 మీటర్ల మహిళల స్పోర్ట్స్ పిస్టల్ విభాగం సహా ఎయిర్ పిస్టల్ మిక్స్‌డ్ టీమ్ విభాగంలో ఇషా సింగ్ చోటు దక్కించుకుంది. భారత స్టార్ బాక్సర్ నిఖత్ జరీన్ సైతం ఆసియా క్రీడల్లో పంచ్ విసరనుంది. తెలంగాణ స్టార్ మహ్మద్ హుసాముద్దీన్ గాయంతో ఆసియా క్రీడలకు దూరం కాగా.. తెలంగాణ సూపర్‌స్టార్ నిఖత్ జరీన్ మహిళల 50 కేజీల విభాగంలో ఆసియా స్వర్ణం కోసం పోటీపడనుంది.

యూకీ బాంబ్రికి ఎటిపి టైటిల్

- మల్లోర్కా చాంపియన్‌షిప్స్ 2023



న్యూఢిల్లీ : భారత టెన్నిస్ ఆటగాడు యూకీ బాంబ్రి కెరీర్ తొలి ఏటీపీ టైటిల్ సాధించాడు. దక్షిణాఫ్రికా ఆటగాడు లాయిడ్ హారిస్ భాగస్వామిగా డబుల్స్ విభాగంలో నిలకడగా రాణిస్తున్న యూకీ బాంబ్రి.. తాజాగా స్పెయిన్‌లోని శాంత పోన్సాలో జరిగిన మాల్లోర్కా చాంపియన్‌షిప్స్‌లో పురుషుల డబుల్స్ టైటిల్ సాధించాడు. ఏటీపీ 250 టోర్నీ ఫైనల్లో 6-3, 6-4తో రాబిన్ హాసే, ఫిలిప్ జోడీపై బాంబ్రి, లాయిడ్ జోడీ వరుస సెట్లలో విజయం సాధించారు. ఏటీపీ డబుల్స్ ర్యాంకింగ్స్‌లో ప్రస్తుతం 75వ స్థానంలో కొనసాగుతున్న యూకీ బాంబ్రి.. ఈ విజయంతో కెరీర్ ఉత్తమ 58వ ర్యాంక్ సాధించనున్నాడు.



ద్వైపాక్షిక సిరీస్‌ల్లో
పెద్దపీట!

- రాష్ట్ర సంఘాలకు జై షా హామీ



ముంబయి : 2023 ఐసిసి వన్డే వరల్డ్‌కప్ మ్యాచులకు ఆతిథ్యం అందించే అవకాశం కోల్పోయిన రాష్ట్ర క్రికెట్ సంఘాలకు బిసిసిఐ కార్యదర్శి జై షా ఊరట అందించాడు. ఈ ఏడాది అక్టోబర్ 5 నుంచి నవంబర్ 19 వరకు భారత్ వేదికగా ఐసీసీ వన్డే వరల్డ్‌కప్ జరుగనుంది. ప్రపంచకప్‌లో 48 మ్యాచులకు పది వేదికలు ఆతిథ్యం ఇవ్వనున్నాయి. ప్రతిష్టాత్మక ప్రపంచకప్ మ్యాచుల కోసం ఇతర స్టేడియాలు సైతం పోటీపడినా.. బిసిసిఐ పది స్టేడియాలనే ఖరారు చేసింది. దీంతో ప్రపంచకప్ మ్యాచులు దక్కని స్టేడియాలకు (రాష్ట్ర క్రికెట్ సంఘాలు) రానున్న ద్వైపాక్షిక సిరీస్‌ల్లో అధిక ప్రాధాన్యత ఉంటుందని జై షా తెలిపారు. ఈ మేరకు ఐసిసి ప్రపంచకప్ షెడ్యూల్ విడుదలకు ముందు రాష్ట్ర క్రికెట్ సంఘాలతో జై షా సమావేశమయ్యారు. ప్రపంచకప్ ఆతిథ్య వేదికలు ధర్మశాల, అహ్మదాబాద్, న్యూఢిల్లీ, ముంబయి, చెన్నై, బెంగళూర్, లక్నో, హైదరాబాద్, కోల్‌కత, పుణెలు ద్వైపాక్షిక సిరీస్ మ్యాచులపై ఆశలు వదులుకునేందుకు అంగీకరించినట్టు సమాచారం. వార్మప్ మ్యాచులు వేదికగా నిలువనున్న గువహటి, తిరువనంతపురం సైతం ద్వైపాక్షిక సిరీస్‌ల్లో అధిక ప్రాధాన్యత దక్కించుకోనున్నాయి. ఈ మేరకు రాష్ట్ర క్రికెట్ సంఘాలకు జై షా ఓ లేఖ రాశారు. హైదరాబాద్‌లోని రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం మూడు మ్యాచులతో పాటు రెండు పాకిస్థాన్ వార్మప్ మ్యాచులకు సైతం వేదికగా నిలువనుంది. హైదరాబాద్‌లో అక్టోబర్ 6 నుంచి ప్రపంచకప్ మ్యాచులు జరుగుతాయి.

7న తుది నిర్ణయం

ఆసియా క్రీడల్లో భారత క్రికెట్ జట్ల ప్రాతినిధ్యంపై భారత క్రికెట్ నియంత్రణ మండలి (బిసిసిఐ) ఈ నెల 7న తుది నిర్ణయం తీసుకోనుంది. ముంబయిలోని బోర్డు ప్రధాన కార్యాలయంలో అపెక్స్ కౌన్సిల్ శుక్రవారం సమావేశం కానుంది. పలు కీలక అంశాలు ఈ సమావేశంలో చర్చకు రానున్నాయి. ఆసియా క్రీడలకు ద్వితీయ శ్రేణి జట్టును పంపించేందుకు బిసిసిఐ గతంలో గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. అయినా, ఆసియా క్రీడల ప్రాతినిధ్యంపై అపెక్స్ కౌన్సిల్ భేటి నిర్ణయమే ఫైనల్ కానుంది. ప్రపంచకప్ వర్కింగ్ గ్రూప్‌ను అపెక్స్ కౌన్సిల్ భేటీలో ఖరారు చేసే అవకాశం కనిపిస్తుంది.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68